ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 19.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:19 (శని)
సహరి : 4:54 (ఆది)

టెన్త్ పరీక్షార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

ఏలూరు క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి):పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 139 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 34 వేల మంది విద్యార్థులు హాజరు కానున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లి, వచ్చే సమయాల్లో హాల్ టిక్కెట్లను చూపించి అల్ట్రా పల్లె వెలుగు, పల్లె వెలుగు, సిటీ ఆర్డనరీ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. పరీక్షలు జరుగుతున్న రోజుల్లో మాత్రమే అనుమతి ఇస్తారు. ఏ ప్రాంతం నుంచి ఏ సెంటరుకు ఎక్కువ మంది విద్యార్థులు హాజరు కానున్నారో విద్యాశాఖాధికారులు తెలిపితే ఆ ప్రాంతాల్లో అదనపు ప్రత్యేక సర్వీసులు నిర్వహించడానికి చర్యలు తీసుకోనున్నారు.

10 నుంచి ఉమ్మడి కృష్ణా 'పది' పరీక్షార్థులకు అల్పాహారం

ఏలూరు అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కైకలూరు, నూజివీడు డివిజన్లలోని ఎనిమిది మండలాల్లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే టెన్త్ విద్యార్థులకు ఈ నెల 10 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు సాయంత్రం వేళ అల్పాహారం పెట్టనున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ సీఈవో అభ్యర్థన మేరకు జిల్లాలోకి విలీనమైన మండలాల హైస్కూళ్లలో 4,300 మంది టెన్త్ విద్యార్థుల వివరాలను అల్పాహారం అందించే నిమిత్తం పంపించినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

నేడు పాఠశాలలకు సెలవు

విద్యాసంవత్సరంలో నిర్దేశిత 220 పనిదినాలతో నిమిత్తం లేకుండా రెండో శనివారం, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కుని ఈ నెల 8న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవును ప్రకటిస్తూ జిల్లా విద్యా శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల విద్య కమిషనర్ నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం శనివారం ఏ పాఠశాలలు పనిచేయనవసరం లేదని స్పష్టతనిచ్చారు.

ముందడుగుతోనే మహిళా సాధికారత



'మహిళా సాధికారిత ఒక్కరోజులో రాదు. రోజూ వేసే ముందడుగుతోనే సాధ్యం. అప్పుడే లక్ష్యాన్ని సాధించగలం' అని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. శనివారం అంతరాత్జీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏలూరులో ర్యాలీ నిర్వహించారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుకు రావాలంటే విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సరైన భాగస్వామ్యం తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు. జేసీ ధాత్రి రెడ్డి సహా వివిధ శాఖల మహిళలు, ర్యాలీలో పాల్గొన్నారు. అన్ని రంగాల్లో మహిళలు సమానత్వం కోసం ముందుకు రావాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

అన్నింటా ఆమె..

నేడు ప్రపంచ మహిళా దినోత్సవం

6

పీ -4 సర్వేను విజయవంతం చేయాలి

» అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం

ఏలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదరికం లేని సమాజ నిర్మాణ లక్ష్యంగా ఈ నెల 8వ తేదీ నుంచి చేపట్టే పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ-4) సర్వేను విజయవంతం చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పీ-4 సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, వర్క్‌ఫ్రం హోం సర్వేలపై ఎంపీడీవో, మునిసిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులతో ఆమె శుక్రవారం సమావేశం అయ్యారు. ఈనెల 8 నుంచి 16 వరకు గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే నిర్వహించాలని, 21 నుంచి 24 వరకు గ్రామ సభలను నిర్వహించాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే ఇప్పటికే 84 శాతం పూర్తయిందన్నారు. సచివాలయాల పరిధిలో నిర్దేశించిన పలు అంశాల్లో ఉత్తమ ప్రగతి కనపర్చిన ఎంపీడీవోలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, సీపీవో వాసుదేవరావు పీ-4 సర్వే నిర్వహణ తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మండల ప్రత్యేకాధికారులు, ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్, డీసీవో శ్రీనివాస్, డీఎస్‌వో ప్రతాపరెడ్డి, ఎంపీడీవో, కమిషనర్లు పాల్గొన్నారు.

ఇంటర్ థియరీ పరీక్షలకు 400 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) ఇంటర్ థియరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ద్వితీయ సంవత్సరం గణితం, వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం పరీక్షలకు 14,616 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 14,216 మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. జనరల్ విభాగంలో 12,797మందికి 12,522 మంది, ఒకేషనల్ విభాగంలో 1819 మందికి 1,694 మంది హాజరయ్యారన్నారు.

'ఓపెన్' ఇంటర్ పరీక్షలకు వంద మంది గైర్హాజరు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య ఇంటర్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన రసాయనశాస్త్రం పరీక్షకు 309 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా 257 మంది, ఆర్థికశాస్త్రం పరీక్షకు 480 మందికి 432 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

'అసంపూర్ణ' యాత్రలు!



» రాష్ట్ర పరిధిలోనే విజ్ఞాన, విహార యాత్రలతో సరి
» రాష్ట్రేతర యాత్రలకు సాకులతో బ్రేక్
» నిధుల సద్వినియోగంలో నిర్లక్ష్యం

ఏలూరు అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాల బాలికలను విజ్ఞాన, విహార యాత్రలకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం విడుదల చేసిన లక్షలాది రూపాయలు కొంతమేరకే ఖర్చుచేసే అవకాశాలుండగా మిగతా నిధులన్నీ వెనక్కి వెళ్లిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు చదువుతున్న బాలబాలికలు, హైస్కూళ్లలో 7, 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులను రాష్ట్రం లోపల, వెలుపల విజ్ఞాన, విహార యాత్రలకు తీసుకెళ్లాలంటూ గత నెల 13న సమగ్రశిక్ష రాష్ట్ర అధికారులు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక తరగతుల విద్యార్థులు ఒకొక్కరికి రాష్ట్రం లోపల అయితే రూ.200, వెలుపల అయితే రూ.2వేలు చొప్పున విడుదల చేయగా, హైస్కూలు విద్యార్థులకు రాష్ట్రం లోపల, వెలుపల ఒకొక్కరికి రూ.2వేలు వంతున విడుదలయ్యాయి. ఈ నెల 5వతేదీ నాటికల్లా యాత్రలను ముగించాలని ఉత్త ర్వుల్లో పేర్కొన్నారు. నిధుల వినియోగం జరగకపోతే ఈనెల 15 తర్వాత బడ్జెట్‌ను వెనక్కి తీసుకునేందుకు సమగ్రశిక్ష ఉన్నతాధికారులు సంకేతాలు పంపడంతో జిల్లాలో ఇప్పుడు హడావుడి ప్రారంభమైంది. ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో దాదాపు 80 శాతం కేవలం రవాణా (ఆర్టీసీ బస్సు) ఖర్చులకే వెళ్లిపో తుండడం, ఇక భోజన, వసతి ఖర్చులు, విహార, విజ్ఞాన ప్రాంతాలు/ కేంద్రాల్లో ఎంట్రీ ఫీజులకు నిధుల కొరత ఎదురయ్యే అవకాశాలు ఉండడంతో రాష్ట్రేతర యాత్రలను నిలిపివేసే నిర్ణయానికి జిల్లా అధికారులు వచ్చినట్టు తెలిసింది.

రాష్ట్రపరిధిలో యాత్రలు ఇలా..

ప్రాథమిక తరగతుల నుంచి 168 మంది బాలబాలికలు ఒక్కొక్కరికి కేటాయించిన రూ.200లతో ఆటపాక పక్షుల సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లాలని తొలుత నిర్ణయించినా భద్రత కారణాలతో విరమించుకున్నారు. తాజా షెడ్యూలు ప్రకారం ఈనెల 19న కె.ఆర్.పురం ఐటీడీఏలో చిరు ధాన్యాలతో (మిల్లెట్స్) మహిళలు తయారు చేస్తున్న బిస్కెట్ల ఫ్యాక్టరీకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. మొత్తం 3 పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులను బుక్ చేశారు. హైస్కూలు విద్యార్థులను తిరుపతిలోని రీజనల్ సైన్స్ సెంటర్, జూ పార్క్, చంద్రగిరి కోటకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈనెల 12న రాత్రి ఏలూరులో బయలుదేరి, యాత్ర ముగించుకుని 13 రాత్రి తిరుగు ప్రయాణం అవుతారు. తిరుపతి వెళ్లే 153 మందిలో 64 మంది బాలురు, 74 మంది బాలికలు, 13 మంది గైడ్‌టీచర్లు, సమగ్రశిక్ష నుంచి ఇద్దరు అధికారులు ఉంటారు. హైస్కూలు విద్యార్థుల యాత్ర కోసం మూడు ఆర్టీసీ బస్సులకయ్యే ఖర్చు రూ.2.47లక్షలు

రాష్ట్రేతర యాత్ర ఇక లేనట్టే

ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ప్రాథమిక, హైస్కూలు విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.2వేలు వంతున విడుదల చేసిన నిధులతో రాష్ట్రం వెలుపల ప్రాంతాలకు విజ్ఞాన, విహార యాత్రలకు తీసుకెళ్లలేమని అధికార వర్గాలు అంచనాకు వచ్చారు. తొలుత హైదరాబాద్ తీసుకెళ్లాలని నిర్ణయించినా ఇప్పుడు రద్దు చేశారు. అయితే నెపాన్ని ప్రభుత్వంపై నెట్టివేస్తే శాఖాపరంగా ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉండడంతో పలు సాంకేతిక అడ్డంకులు, అభ్యంతరాలను తెరపైకి తెచ్చినట్టు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం వరకు టీచర్లకు శిక్షణ తరగతులు, పరీక్షల సీజన్ ప్రారంభమవుతుండడం, అధిక ఉష్ణోగ్రతలు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అయిష్టత, తదితర సాకులను చూపిస్తున్నారని తెలిసింది. మొత్తంమీద ఈ సాకుల సంగతి ఎలాఉన్నా విద్యార్థుల విజ్ఞాన, విహారయాత్రలు అసమగ్రంగానే ముగిసి, ఆ మేరకు నిధులు వెనక్కి వెళ్లిపోనున్నాయి.

కాగా, ఇక ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో కేవలం రూ.75 వేలు మాత్రమే మిగుతున్నాయి. ఇందులోనే అన్నీ సర్దుబాటు చేయాలి. దీంతో తిరుపతిలో భోజన సౌకర్యం కోసం స్థానికంగా ఓ స్పాన్సర్‌ను ఆశ్రయించారు. ఇక ఎక్కడైనా చేతి డబ్బులు వేసుకోవాల్సిన పరిస్థితులు టీచర్లే భరించడానికి స్వచ్ఛందంగా అంగీకారాన్ని తెలిపినట్టు సమాచారం.

ఆస్పత్రిలో సెగలు..



ట్రామాకేర్‌లో ఏసీలు పనిచేయక రోగుల అవస్థలు

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పేరుకే ఏసీలు

» పనిచేయక రోగుల నరక యాతన
» పట్టించుకోని అధికారులు
» తొలగించిన పాత ఏసీలు పక్కదారి

ఏలూరు క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు ముదురుతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏసీలు పనిచేయకపోవడంతో ఉక్కబోతను తట్టుకోలేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి అధికారులు నిర్లక్ష్య ధోరణితో రోగులు ఎలాపోతే మాకేంటని విధులను నిర్వర్తించడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు నరకయాతన పడుతున్నారు. ఈ ఆస్పత్రి గతంలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిగా ఉండేది. ఆనాడు మెరుగైన వైద్య సేవలు, ఉత్తమ సదుపాయాలు ఉండేవి. ఎక్కడైనా ఫ్యాను పోయినా, ఏసీలు పనిచేయకపోయినా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకునేవారు. ఏలూరునకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ 2023 ఏప్రిల్ 26న మంజూరైంది. అప్పటి నుంచి ఏలూరు జిల్లా ఆస్పత్రి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారింది. 550 పడకలు ఉన్న ఆస్పత్రి 330 పడకలకు మారింది. ఆస్పత్రిలో వైద్య సేవలు అంతంత మాత్రంగానేఉన్నాయని రోగులు గగ్గోలు పెట్టారు. ఆస్పత్రికి వస్తే విజయవాడ, గుంటూరుకు రిఫరల్ చేస్తున్నా రంటూ పలుసార్లు ధర్నాలు నిర్వహించారు.



ఐసీయూలో పనిచేయని ఏసీలు

ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్‌లకు మెరుగైన సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఆరోగ్యశ్రీ నిధులతో గతంలో ఆస్పత్రిలో రోగులకు సౌకర్యాలు కల్పిస్తున్నామంటూ ఆగమేఘాల మీద ఎవరి అనుమతులు లేకుండానే 50కి పైగా ఏసీ (ఎయిర్ కండీషన్ యూనిట్లు)లను కొనుగోలు చేశారు. అయితే ఏసీలకు వారంటీ ప్రకారం రీ సర్వీసింగ్‌లు ఉన్నా వాటిని సకాలంలో చేయించకపోవడం తో ప్రస్తుతం కొన్ని మాత్రమే పనిచేస్తున్నాయి. వేసవి రావడంతో ఏసీలు లేక ఉక్కపోతతో రోగులు తల్లడిల్లిపోతున్నారు. అత్యవసర విభాగం వద్ద రోగులకు ప్రాథమిక చికిత్స అందించే గదిలో మూడు ఏసీలు ఉండగా ఒక్కటీ పనిచేయడం లేదు. ట్రామాకేర్ యూనిట్‌లో ఐదు ఉండగా ఒకటి మాత్రమే పని చేస్తోంది. ఈఎండీ వార్డు, ఐసీయూ (26వ నంబర్)లలో ఏసీలు కొన్ని పనిచేయడం లేదు. మిగిలిన విభాగాల్లోను ఇదే పరిస్థితి.

అధికారుల ఏసీలు ఓకే..

ప్రతి విభాగానికి సంబంధించిన హెచ్‌వోడీలకు ఒక్కొక్క రూమును కేటాయించి వాటికి ఏసీలు పెట్టారు. ఇంకా కొంతమంది నర్సింగ్ విభాగానికి చెందిన వారికి రూములను కేటాయించి ఏసీలను పెట్టారు. ఆస్పత్రి అధికారులకు ఏసీలు ఉన్నాయి. అవి కొద్ది క్షణాలు మొరాయిస్తే మరుక్షణంలోనే మర్మతులు చేయడానికి టెక్నీషియన్లను రంగం లోకి దించుతున్నారు. కాని రోగుల వార్డుల్లో ఏసీలు పనిచేయకపోయినా తమకు ఏమి తెలియనట్లే అధికారులు వ్యవహరిస్తున్నారు. నిత్యం ఆస్పత్రిని బృందంగా పరిశీలన చేస్తూ అన్ని సమస్యలు తెలుసుకుంటున్నామనే అధికారులకు ఈ సమస్య కనబడడం లేదా..? అంటూ రోగులు ప్రశ్నిస్తున్నారు.

పాత ఏసీలు ఏమయ్యాయి..?

కొత్త ఏసీలు పెట్టిన సమయంలో తొలగించిన పాత ఏసీలు ఏమయ్యాయన్నది ప్రశ్నగా మిగిలింది. పనిచేసే పాత ఏసీలు కొన్నింటిని కొంతమంది సిబ్బంది తీసుకుపోయి లెక్క కోసం పాత సామాన్లు వారి వద్ద కొనుగోలు చేసిన ఏసీలను తీసుకొచ్చి ఇక్కడ పెట్టారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు దృష్టి సారించి తక్షణం ఆస్పత్రిలో ఏసీలను మరమ్మతులు చేయిం చాలని, పాత ఏసీల సంగతిని తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఈసారి ఏం చేస్తారో ?

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీపై తీవ్ర ఉత్కంఠ

» ఉమ్మడి పశ్చిమలో అరడజను పైగా ఆశావహులు
» ప్రతిసారీ ఛాన్స్ కోసం ఎదురుచూపులే
» ఈసారైనా కనికరించకపోతారా అనే ఆశ
» ప్రయత్నాల్లో పార్టీ సీనియర్లు

7



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కిశోర్

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సిబ్బంది సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. జిల్లాలో పని చేస్తున్న పోలీస్ సిబ్బంది, హోంగార్డులు, ఏఆర్ పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించి వినతులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. విధి నిర్వహణలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

కన్ను తెరవకుండానే..



» కైకలూరు ఆసుపత్రి బాత్‌రూంలో పసికందు మృతదేహం
» కడుపునొప్పి అని వచ్చిన గర్భిణి..
» బిడ్డను ప్రసవించి వదిలేసి వెళ్లిపోయినట్టు అనుమానం
» పొంతనలేని సమాధానాలు చెబుతున్న వైద్యులు
» ఆసుపత్రిలో పనిచేయని సీసీ కెమెరాలు
» కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కైకలూరు, మార్చి 7(ఆంధ్ర జ్యోతి):కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రం బాత్‌రూమ్‌లో ఆడ మృతశిశువు కనిపించడంతో కలకలం రేగింది. శుక్ర వారం ఉదయం మూడు గంటల సమ యంలో కడుపు నొప్పి వస్తుందని గర్భిణి అయిన 18 ఏళ్ల యువతి, మరో ఇద్దరు ఆసుపత్రికి వచ్చారు. డ్యూటీ డాక్టర్ ప్రాథమిక వైద్యం అందించిన కాసేపటికే ఆమె వెళ్లిపోయింది. వేకువజామున ఆసుపత్రిలోని రోగులు బాత్‌రూమ్‌కు వెళ్లగా అక్కడ ఆడ మృత శిశువును గమనించి వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. వైద్యులు శిశువును పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు పొంతన లేని సమాధానాలు చెప్పడం పలు అనుమానాలను కలిగిస్తోంది. ఈ ఘటనపై ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కె.శ్వేతను విలేకరులు ప్రశ్నించగా ఆసుపత్రిలో ఎలాంటి ప్రసవాలు జరగలేదని ఉదయం ఆరు గంటలకు స్వీపర్లు ఆవరణ శుభ్రపరుస్తుండగా జనరేటర్ వద్ద మృత శిశువును గుర్తించి సమాచారం ఇచ్చారని తెలిపారు. వెంటనే వచ్చి వైద్యం చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతి చెంది ఉన్నట్లు స్పష్టం చేశారు. అయితే ఇందుకు భిన్నంగా ప్రభుత్వాసుపత్రి రిజిస్టర్‌లో ఉదయం మూడు గంటల సమయంలో 18 ఏళ్ల యువతి ఆసుపత్రిలో అడ్మిట్ అయినట్లు ఉంది. రాత్రి విధుల్లో వున్న డాక్టర్ కరిష్మా బేగం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఉదయం ఆరు గంటల సమయంలో ఆసుపత్రి బాత్‌రూమ్‌లో ఆడ మృత శిశువును గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ పనిచేయకపోవడంతో ఆ యువతి ఎవరనే విషయం తెలియడం లేదు. ఆసుపత్రిలో జాయిన్ అయిన పేషెంట్ ఊరి పేరు, ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయాలి. దీనిపై ఆవేమీ ఇక్కడ చేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది. వైద్యులు పోలీసులకు ఇచ్చిన రిపోర్టులో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో జాయిన్ చేసుకుని వైద్యం చేసినా చేయలేదంటూ వైద్యాధికారిణి మాట్లాడడంపై ఈ తంతు అంతా వారికి తెలిసే జరిగినట్లు అర్థమవుతోంది. వైద్యుల నిర్లక్ష్యం ఎక్కడ బయట పడుతుందోనని కప్పి పుచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఆస్పత్రి వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు విచారణ

వైద్యుల ఫిర్యాదు మేరకు కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ, ఎస్ఐ ఆర్.శ్రీను తాలుకా సెంటర్, పెద్ద మసీదు సెంటర్లలోని సీసీ కెమెరాల ఆధారంగా ఏ సమయంలో ఆసుపత్రికి వచ్చిన ముగ్గురు ఎవరు ? తర్వాత వారు ఎక్కడకు వెళ్లారనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. యువతి మరణించిన శిశువుకు జన్మనిచ్చిందా లేదా ప్రాణంతో ఉన్న శిశువును చంపి బాత్రూంలో పడవేశారా అనే కోణంలోను దర్యాప్తు చేపట్టారు. సెక్యూరిటీ గార్డు ఆ సమయంలో ఏం చేస్తున్నారు అనే ప్రశ్నలు వస్తున్నాయి.

నాన్న కల.. నేను సాధించాను

ఖతీఫ్ కౌసర్ భనో , తాడేపల్లిగూడెం ఆర్డీవో



మాది గుంటూరు. నాన్న హుస్సేన్ లెక్చరర్‌గా స్థిరపడ్డారు. ఆయనకు మేం ఇద్దరు అమ్మాయిలం. చెల్లి వైద్య వృత్తిని ఎంచుకోవాలని నిర్ణయించుకుంది. సివిల్స్ సాధించాలన్నది నాన్న కల.. ఎం ఫార్మసీలో మాస్టర్స్ చేసిన నాకు సివిల్స్ తప్ప వేరే ఆలోచన లేదు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూనే గ్రూప్-1 మొదటి ప్రయత్నం లోనే ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగంలో చేరాను. 2022లో కడపలో స్పెషల్ కలెక్టర్‌గా చేరాను అక్కడ నుంచి ఆర్డీవోగా రామచంద్రా పురం, ప్రస్తుతం తాడేపల్లిగూడెంలో విధులు నిర్వహిస్తున్నా. నా భర్త హుస్సేన్ బాషా ప్రైవేటు రంగంలో ఉత్తర భారత దేశంలో హెడ్‌గా పనిచేస్తున్నారు.

అవమానాలను అధిగమించి.. ఎస్సైగా

దండే నాగ ప్రసన్న, తాడేపల్లిగూడెం



ఎంబీఏ చేశాను. వివాహం అయినా నేను ఏదో సాధించాలనే తపనతోనే ముందుకు సాగాను. నా భర్త సుధీర్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బ్యాంక్ టెస్టులు రాస్తూనే కాంపిటేటివ్ పరీక్షలు రాసేదాన్ని. ఏ పరీక్షల్లోనైనా జనరల్ కేటగిరీలో తృటిలో ఉద్యోగం మిస్ అయ్యేది. చివరికి సచివాలయంలో మహిళా పోలీస్‌గా కడపలో ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగం చేస్తూ రిలాక్స్ అయ్యాను. ఆ సమయంలో పోలీస్ స్టేషన్‌లలో సమావేశాల్లో మహిళా పోలీసుగా నాకు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. కానిస్టేబుల్‌గా ఉన్న వారు ఓ సందర్భంలో స్టేషన్‌లో కూర్చుండగా అక్కడి సిబ్బంది ఫ్యాన్ ఆపేశారు. అలాంటి వారి దగ్గర నుంచి సెల్యూట్ అందుకోవాలని కసిగా ఫిజికల్ టెస్టులు పూర్తిచేసుకుని ఎస్సైగా ఉద్యోగం సాదించాను. నా భర్త సుధీర్ నాకు అనుక్షణం అండగా ఉన్నారు.

సవాళ్లను సానుకూలంగా స్వీకరించా..

శనగన వరలక్ష్మి, నందమూరు సర్పంచ్




ఢిల్లీలో జరిగిన సదస్సులో వరలక్ష్మి


నేను సర్పంచ్‌గా ఎన్నికైనపుడు వైసీపీ ప్రభుత్వం ఉంది. పేరుకు సర్పంచ్‌నే అయినా నిధులు, విధులు లేకపోవడం చాలా ఇబ్బందిగా అనిపించింది. నా పక్షాన ఉన్న వారు కూడా ప్రతిపక్ష నేతలతో చేతులు కలిపి నన్ను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. నా భర్త రాంబాబు సహకారంతో గ్రామంలో సురక్షిత మంచినీరు అందించడం నుంచి గ్రామంలో పారిశుధ్యం, ఎర్ర కాలువ వరదలకు ప్రజలు ఇబ్బంది పడుతుంటే మేం వెంట ఉండి సాయం చేయడం ఎంతో తృప్తినిచ్చింది. ప్రజలకు మంచినీరు అందించేందుకు మంచినీటి చెరువు శుభ్రం చేయిస్తే అప్పటి మంత్రి ఆదేశాలతో నా చెక్ పవర్ రద్దు చేశారు.. సవాళ్లను సానుకూలంగా తీసుకుని పనిచేశాను. నా పని తీరుకు ప్రస్తుతం మహిళా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో వర్క్ షాపులో పాల్గొనేందుకు అవకాశం కల్పించడం చాలా ఆనందంగా ఉంది.

- తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి)

బహుశక్తి స్వరూపిణీ.. నమో నమః



తన ఒడినే తొలి బడిగా చేసి
ఓనమాలు నేర్పే గురువుగా
చందమామను చూపుతూ
గోరుముద్దలతో కడుపు నింపే తల్లిగా
ఊయలే లోకంగా పాలించే శిశువును
సేవించే సేవికగా
ఉంగా ఉంగా అంటూ కొంగట్టుకు
తిరిగే పసికూనకు లోకం చూపే జ్ఞానిగా
బుడి బుడి అడుగులతో పడిలేచే
బుడతడని వేలు పట్టి నడిపించే మార్గదర్శకురాలిగా
తప్పులు చేస్తే సుతిమెత్తగా దండించే శిక్షకురాలిగా
తప్పులను సవరించుకునే మార్గాలను చూపే క్రాంత దర్శకురాలిగా
లక్ష్యసాధన దిశగా విజయాలందుకునే త్రోవను నడిపించే పథనిర్దేశకురాలిగా
ఆచరణాత్మక ఆలోచననందించే కరణేషు మంత్రిగా
క్రియాశీలక నిర్మాణాత్మకాలలో పాలుపంచుకునే రూపకర్తగా
అందరినీ ఒప్పించి ఏకత్రాటిపై నడిపించే నాయకురాలిగా
మగవారితో ఏ మాత్రం తీసిపోని తిరుగులేని నేతగా
స్వాభిమానంతో ప్రకాశించే మహోన్నత వ్యక్తిత్వంతో విరాజిల్లే ధీరవనితగా
సకాలంలో సమస్యలను గుర్తెరిగి పరిష్కారాన్ని సూచించే నేర్పరిగా
క్లిష్టపరిస్థితుల్లో స్థైర్యం కోల్పోకుండా నిగ్రహంతో ప్రవర్తించే ధైర్యశాలిగా
బాధ్యతలను సక్రమంగా నెరవేర్చే కర్తవ్యోన్ముఖురాలిగా
తన ఉనికిని చాటుకొంటూ తన అస్తిత్వాన్ని పదిలపరచుకొంటూ
ప్రతికూల పరిస్థితులను సైతం అనుకూలంగా మలచుకునే కూర్పరిగా
అన్నిటా తానే అయి తను వినా విశ్వం లేదన్నట్లుగా
విశ్వమనే కుటుంబంలో అంకిత భావంతో
శ్రమియించే నిస్వార్థ త్యాగజీవిగా
బహుముఖ శక్తి స్వరూపమైన మహిళాలోకానికి
నమో నమః



- తెన్నేటి మాస్టారు: 82474 33432

అన్నింటా ఆమె..





మహిళలు ఆత్మస్థైర్యంతో తాము అనుకున్న లక్ష్యాలను సాధిస్తున్నారు.. అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధికి బాటలు వేసుకుంటున్నారు.. ఉన్నత చదువులతో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు.. అటు కుటుంబంతో పాటు ఇటు ఉద్యోగ నిర్వహణలో ప్రత్యేకత చాటుకుంటున్నారు.. నేడు ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విజయతీరాలను చేరిన కొందరు మహిళా మణుల సక్సెస్‌పై ప్రత్యేక కథనం..

నేడు ప్రపంచ మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవం సందర్భంగా ఏలూరులో నిర్వహించిన మారథాన్‌లో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, మహిళలు

మహిళల హక్కుల రక్షణే లక్ష్యంగా మహిళా దినోత్సవం

ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళా అభివృద్ధికి సహకారం అందించాలని, ఆడపిల్లలకు చదువు ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. అన్నారు. మహిళా సాధికారితపై చైతన్య పరచడం ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికల హక్కులను రక్షించే లక్ష్యంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. శుక్రవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి నిర్వహించిన 2కే మారథాన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఏఎస్ఆర్ స్టేడియం నుంచి పాత బస్టాండు వరకు ఉత్సాహంగా జరిగిన ర్యాలీలో కలెక్టర్‌తో పాటు జేసీ దాత్రిరెడ్డి, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టి.సాల్మన్‌రాజు, ఐసీడీఎస్ పీడీ టి.శారద, ఇతర అధికారులు, ఉద్యోగులు, మహిళలు, బాలబాలికలు, క్రీడాకారులు పాల్గొన్నారు. మహిళాదినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 8వ తేదీన సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు.

మహిళగా జన్మించడం ఎంతో గర్వకారణం

ఘంటా పద్మశ్రీ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్



ఒక మహిళగా జన్మించటం ఎంతో గర్వకారణం. జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌కు సంబంధించి మహిళా ఉద్యోగులకు ఎటువంటి సమస్యలు వచ్చినా వాటిని పరిష్కరిస్తున్నాను. ఎన్నో సవాళ్ళు ఎదురైనా మహిళలు రాజకీ యాల్లో ప్రజా ప్రతినిధులుగా తమకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చు కుంటున్నారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుకు రావాలంటే విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సరైన భాగస్వామ్యం తప్పనిసరి. సమాజంలో ఒక మహిళను బలపరిస్తే ఆమె ఒక కుటుంబాన్ని బలపరుస్తుంది. ఒక కుటుంబం బలంగా ఉంటే సమాజం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుంది. ఇదే మహిళా స్ఫూర్తి .

మహిళలు స్వతంత్రంగా వ్యవహరించాలి

శ్రీలక్ష్మి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, ఏలూరు



మహిళలు స్వతంత్రంగా వ్యవహరించాలి. ఆర్థిక వ్యవహారాల్లో కూడా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిఉండాలి. ప్రతి మహిళ తన తల్లినుంచి నేర్చుకున్న పాఠాలతో స్వతంత్ర భావన కలిగిఉండాలి. ప్రతి ఒక్క తల్లితండ్రులు, తమ పిల్లలను ఆడ, మగ తేడా అనే వ్యత్యాసం లేకుండా పెంచాలి. ప్రొఫెషనల్ కోర్సులు నేర్పించి వారిలో ఉన్న నైపుణ్యతను వెలికితీయాలి.మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదు. తాము కావాలను కున్నది సాధించేవరకు పట్టుదలతో వ్యవహరించాలి.

ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలి

కొడాలి అనూరాధ, జిల్లా పంచాయతీ అధికారిణి, ఏలూరు



మహిళలు తాము సాధించలేమన్న భావనను విడనాడి అన్నిరంగాల్లో ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలి. మహిళా ఉద్యోగులు ఇంటా, బయటా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నా రంటే వారిలో ఉన్న ఆత్మవిశ్వాసం. ఉద్యోగ నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని పనిచేస్తున్నాను.

-ఏలూరు సిటీ(ఆంధ్రజ్యోతి)

అతివకు ఆలంబనగా..

- అతివకు ఆలంబనంగా కూటమి ప్రభుత్వం పలు కార్యక్రమాలను తీసుకుంది. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తోంది. బీసీ కార్పొరేషన్ ద్వారా 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు తాజాగా కుట్టుశిక్షణ ఇప్పించి ఉపాధికి ఊత మిచ్చేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నారు.
- ఏలూరు జిల్లాలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు పదుల సంఖ్యలో జిల్లా పరిపాలనలో మహిళా మణులు పనిచేస్తున్నారు. అత్యధికంగా మహిళా,శిశుసంక్షేమశాఖలో అంగన్‌వాడీ టీచర్లుగా మహిళలు 1915 మంది విధుల్లో ఉన్నారు. 10 ప్రాజెక్టుల్లో 9 మహిళా సీడీపీవోలు పనిచేస్తున్నారు. రెవెన్యూ శాఖలో 8 మంది మహిళా తహసీల్దార్లు, 15 మంది డీటీలు పనిచేస్తున్నారు.

ఉద్యమ పంథాతో యువతకు స్ఫూర్తి



సంకు మనోరమ

వృత్తి రీత్యా అధ్యాపకురాలు..తన తండ్రి, మాజీ ఎమ్మెల్సీ, కమ్యూనిస్టు నాయకుడు సంకు అప్పారావు ఉద్యమ బాటలో పయనిస్తూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమం నుంచి ఇటీవల జరిగిన ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు వరకూ ఆమే అనేక ఉద్యమాల్లో పాల్గొని తన పోరాట పంథాతో యువతకు యువతకు స్ఫూర్తిగా నిలిస్తున్నారు సంకు మనోరమ.. ఏలూరు సెయింట్ థెరిస్సా కళాశాలలో డిగ్రీ విద్యార్థిగా వున్నప్పుడే విశాఖ ఉక్కు ఉద్యమంలో పాల్గొన్నారు. దూబగుంట రోశమ్మ ఆధ్వర్యంలో జరిగిన మద్యపాన నిషేధ ఉద్యమంలో పాల్గొన్నారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూనే అక్షర దీక్ష, నిరంతర విద్య విభాగాలలో జిల్లా కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. అంతరిక్షంలో ప్రయాణించిన మొదటి మహిళ వాలెంటీనా థెరిస్కోవా ఆధ్వర్యంలో 1973లో మాస్కోలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో షీలా కౌల్ నాయకత్వంలోని భారత ప్రతినిధి బృందంలో మనోరమ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా పాల్గొన్నారు. 2009లో నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి లోక్ సత్తా పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. అనంతరం సమైక్యాంధ్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొని విభజన అనంతరం అవశేష ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రత్యేక హోదా కల్పించాలని జరిగిన ఉద్యమాల్లో లోక్‌సత్తా పార్టీ తరపున పాల్గొన్నారు.

- తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి)

మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలనేది మా అమ్మ..

ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత



ఆడపిల్లలకు చదువులెందుకు..పెళ్లిళ్ల చేసేయ్ అనే రోజుల్లోనే మా అమ్మ ఓబులమ్మ ఎవరిపైన ఆధారపడకుండా ఆర్థిక స్వాతంత్ర్యం కోసం చదువుతో పాటు, ఉద్యోగం అవసరమని చెప్పేది. అలాగే నలుగురు అమ్మాయిలను చదివించింది. ఆమె స్ఫూర్తితోనే మేమంతా చదువుకుని పెద్ద ఉద్యోగాల్లో స్థిరపడ్డాం.. తండ్రి జైలర్.. తల్లి ఏమీ చదువుకోలేదు. మేము ఐదుగురు సంతానం. వరుసగా నలుగురు అమ్మాయిల తర్వాత తమ్ముడు పుట్టాడు. నేను బీకాం చదివి తర్వాత జర్నలిజంపై ఇంట్రస్టుతో పద్మావతి కళాశాలలో కమ్యూనికేషన్ అండ్ మాస్ జర్నలిజం పూర్తిచేశాను. 2007లో గ్రూప్-1కు ఎంపికై శిక్షణ తర్వాత ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా భీమవరంలో తొలి పోస్టింగ్ లభించింది. ఇటీవలే మూడు నెలలు క్రితం ఏలూరు జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా వచ్చా. ఇటు ఉద్యోగం, కుటుంబం రెండింటికి సమంగానే ప్రాధాన్యం ఇస్తున్నాను. మావారి సహకారం మరువలేను. ఆడపిల్లలకు చదువు అవసరమని చెప్పిన అమ్మ మాటలు ఎప్పటికీ మరిచిపోను..

టీచర్ అయి పాఠాలు చెప్పాలకున్నా..

పెనుమాల శారద, జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ పీడీ



టీచర్ అయ్యి చిన్నారులకు పాఠాలు చెబుతామనుకున్నా. అనూహ్యంగా మహిళా, శిశుసంక్షేమ శాఖలో సూపర్‌వైజర్‌గా ప్రవేశించి ఇప్పుడు ఐసీడీఎస్ ప్రాజెక్టు డెరెక్టర్ అయ్యా. భీమవరం బేతపూడిలో ఓ మధ్య తరగతి కుటుంబం. ఆ ఊరులో చదువుకున్న మహిళల్లో అతి తక్కువ మందిలో నేను ఒకరిని. ఆంధ్రా యూనివర్శిటీలో ఎంఏ, భీమవరంలో బీఈడీ పూర్తి చేశా. 2012లో ఉద్యోగ వేట మొదలు పెట్టాను. డీఎస్సీలో 0.5 పాయింట్ మార్కు తేడాతో ఉద్యోగం రాలేదు. గ్రూప్-3లో జూనియర్ అసిస్టెంట్ పోస్టు కోసం, మరోవైపు ఏపీపీఎస్సీ నిర్వహించిన మహిళాశిశు సంక్షేమశాఖలో గ్రేడ్-1 సూపర్‌వైజర్, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ నిర్వహించిన హాస్టల్ వార్డెన్ పరీక్షలకు హాజరయ్యా. ఈ మూడు పోస్టులకు ఒకేసారి సెలక్ట్ అయ్యా. మహిళాశిశుసంక్షేమశాఖ సూపర్‌వైజర్‌గా విధుల్లో చేరా. టీచర్ కావాలనే కల నెరవేరక పోయినప్పటికీ అంగన్‌వాడీ సెంటర్లలో శిక్షణ, ఇతర కార్యక్రమాల్లో పిల్లలకు ఆట, పాటలతో చక్కగా వివరించగలగడం నాకెంతో ఆనందాన్నిస్తుంది. నా భర్త డేవిడ్‌రాజు సహకారం వల్ల అటు ఉద్యోగం, ఇటు కుటుంబంలో ఎలాంటి సమస్యలు లేకుండా పనిచేస్తున్నాను.

- ఏలూరు (ఆంధ్రజ్యోతి)

ఇంటికి పెద్ద కొడుకును నేనే..

ఉమ్మడి జిల్లా డీఈవో మురారి వెంకటలక్ష్మమ్మ



ఇంటికి పెద్దమ్మాయినే అయినా పెద్దకొడుకుగా నన్ను ప్రోత్సహించారు. గ్రామీణ రైతు కుటుంబానికి చెందిన ఆడపిల్లనైనప్పటికీ ఎక్కడా లోటులేకుండా చదివించారు. నాకు ఇద్దరు తమ్ముళ్ళు. ఊరిబడి నుంచి కళాశాల విద్యవరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే పూర్తిచేశాను. పెళ్లికి ముందే గ్రూప్-2కి సెలెక్ట్ అయ్యాను.తల్లితండ్రులు అల్లూరయ్య, ఈశ్వరమ్మ, పెళ్ళైన తర్వాత భర్త బాల రాజేశ్వర్ వెన్నంటి ఉండటమే నా సక్సెస్‌కి కారణం. కుటుంబపరంగా, ఉద్యోగ విషయాల్లో ఏ సలహాకైనా నా బాల్య స్నేహితులు పి.గాయత్రి, సూర్యకుమారి, అనూరాధలను సంప్రదిస్తా. మాకు ఒక్కతే కుమార్తె. ఎంబీ బీఎస్ చదువుతోంది. తల్లితండ్రులు పిల్లలను ఆడ, మగ తేడా లేకుండా ప్రోత్సహించాలి. అమ్మాయిలు బాగా చదువుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. అమ్మానాన్నలు గర్వించేలా, వాళ్ళ ఆశలు నెరవేర్చేలా ఉండాలి.

- ఏలూరు అర్బన్ (ఆంధ్రజ్యోతి)

పది మందికి ఉపాధినిస్తూ

శివజ్యోతి , డ్వాక్రా మహిళ, పోలవరం



నాకు వివాహమైంది. ఇద్దరు పిల్లలు. భర్త నిరుద్యోగి. పిల్లల ఫీజులు కూడా నేనే కట్టుకోవాల్సిన పరిస్థితి. బయటికి కూలిపనికి వెళతానంటే ఒప్పుకోడు. డ్వాక్రా సంఘంలో రుణం తీసుకుని ఇంటి వద్ద కిరాణా దుకాణం పెట్టుకున్నాను. జీడిగింజలు ఒలిచే మిషన్లు ఇంటి వద్దనే పెట్టుకుని నాతో పాటు పదిమందికి ఉపాధి కల్పించాను. సీజను కాకపోవడం వలన మిషన్ల పని ఆగింది. మహిళలని చులకనా బావం లేకుండా పురుషులు ప్రోత్సాహం అందిస్తే స్త్రీలు రాణిస్తారు, కుటుంబానికి అండగా నిలుస్తారు.

- పోలవరం, (ఆంధ్రజ్యోతి)

ఫొటోగ్రాఫర్‌గా.. కుటుంబానికి తోడుగా ..



భర్తకు తోడుగా కుటుంబ బాధ్యతల్లో పాలు పంచుకుంటూ ఫోటో స్టూడియో నడుపుతున్నారు జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన మహిళ నూతంగి సునీత. ఇంటర్ తర్వాత వివాహం అనంతరం ఇంట్లో ఖాళీగా ఉండకుండా తన భర్త రాజు సహకారంతో ఫొటో స్టూడియో ఏర్పాటు చేసి పట్టణంలో పది సంవత్సరాలుగా ఫోటోగ్రఫీ రంగంలో రాణిస్తున్నారు. బర్త్‌డే ఫంక్షన్లు, మెచ్యూర్ ఫంక్షన్లకు ఫోటోలు తీస్తుంటారు. ఖాళీగా కూర్చోకుండా కుటుంబానికి సహకారంగా ఉంటూ పలువురుకి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- జంగారెడ్డిగూడెం, (ఏలూరు) (ఆంధ్రజ్యోతి)

వృద్ధిరేటు..పైకి

- పెరిగిన పంట దిగుబడులు
- భూగర్భ జల సంపద వృద్ధి
- ఊపందుకున్న ఇరిగేషన్ ప్రాజెక్టులు

2024-25 సామాజిక ఆర్థిక సర్వే నివేదికలో వెల్లడైన అంశాలు ఇవీ



ఏలూరుసిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి సంబంధించి సామాజిక ఆర్థిక సర్వే నివేదికలు వచ్చేశాయి. దీని ఆధారంగా జిల్లాలో ప్రణాళికలు, విధాన రూపకల్పనకు డేటా సేకరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సోషియో ఎకనామిక్ సర్వేలో (సామాజిక ఆర్థిక సర్వే) రాష్ట్రంలో ఏయే రంగాల్లో ప్రగతి దిశగా పయనిస్తోంది ? జిల్లాల వారీగా వ్యవసాయ , ఉద్యాన, పారిశ్రామిక , ప్రజల ఆర్థిక పరిస్థితులు, వంటి అనేక కీలక అంశాలను పరిగణలోకి తీసుకుని నివేదిక విడుదల చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జనసాంద్రత చదరపుకిలోమీటరుకు 470గా ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అక్షరాస్యత 1981 నుంచి 2011 వరకు పరిశీలిస్తే పెరిగినట్లు ఈ సర్వే చెబుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అక్షరాస్యతా రేటు 74.32 శాతంగా ఉంది. ధరల పెరుగుదల కారణంగా జీవన వ్యయంపై ప్రభావం పడుతున్నట్లు ఈ సర్వే స్పష్టం చేసింది. జిల్లాలో ఆక్వా, చేపల పరిశ్రమ, సేవల రంగం పెరుగుతోందని సూచించింది. జిల్లాలోని జనాభాతోపాటు సహజ వనరులు, వ్యవసాయం, పండ్ల తోటలు పెంపకం, జిఎస్‌డిపి, జీడీపీ, ప్రజా పంపిణీ వ్యవస్థ, పంటరుణాలు , ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వంటి అనేక వివరాలను ఈ సర్వే రిపోర్టులో పొందుపరిచారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ప్రగతి నివేదికలు కూడా ఈ సర్వేలో పొందుపరిచారు.

పెరుగుతున్న జనాభా



రోజురోజుకు జనాభా పెరుగుతోంది. 1971 సంవత్సరం నుంచి 2011 జనాభా లెక్కల వరకు పరిశీలిస్తే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనాభా పెరుగతూనే వస్తోంది. జిల్లాల విభజన తర్వాత జనాభా లెక్కలు ఇంకా జరగలేదు. అయితే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1971లో 19.78 లక్షలు జనాభా ఉండగా 2011లో జనాభా లెక్కల ఆధారంగా పరిశీలిస్తే 39.95 లక్షలకు జనాభా చేరింది. అయితే ఏలూరు జిల్లా విషయాని కొస్తే ఈ జనాభా 20.06 లక్షల వరకు ఉంది. 2022లో ఏలూరు జిల్లా ఏర్పాటు అయింది. ఏలూరు జిల్లాలో జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 310 గా ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జనసాంద్రత చదరపుకిలోమీటరుకు 470గా ఉంది. ఏలూరు జిల్లాలో పురుషుల కంటె మహిళలు అధికంగానే ఉన్నారు. ప్రతి వెయ్యిమంది పురుషులకు 1002 మంది మహిళలు ఉన్నారు.

పెరిగిన భూమి వినియోగం

జిల్లాలో మొత్తం 3.77 లక్షల హెకార్లు భూమిని వినియోగిస్తుండగా ఇందులో 17 వేలు అటవీ ప్రాంతం, సాగులో లేని భూమి 14 వేలు హెక్టార్లుగా ఉంది. వ్యవసాయేతర అవసరాలకు 80 వేలు హెక్టార్లు వినియోగిస్తుండగా, వివిధ పంటలకు సంబంధించి సాగుభూమి 2.05 హెక్టార్లు ఉంది.వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో చాలా మంది రైతులు ఆక్వా కల్చర్ వైపు మొగ్గుచూపు తుండగా జాతీయ రహదారులకు , రాష్ట్ర రహదారులకు అనుకుని ఉన్న పంటపొలాలు ఇళ్ళ స్థలాలుగా మారు తున్నాయి. వరితో పాటు ఇతర పంటల విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది.. పామాయిల్ పంట సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. మామిడి, జీడిమామిడి తోటల విస్తీర్ణం గతంతో పోలిస్తే తగ్గిందని చెప్పవచ్చు. కూరగాయలు, పూలతోటలు, పండ్ల తోటల విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది.

వర్షపాతం గణనీయం



ఈ ఏడాది వర్షపాతం సాధారణానికి మించి కురవడంతో భూగర్భ జల సంపద కూడా గణనీయంగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ జలాలు 4.15 మీటర్లు వరకు పెరిగాయి. 2023లో 19.37 మీటర్లు లోతు ఉన్న భూగర్భజలాలు 2024 అక్టోబరు నాటికి 15.22 లోతుకు చేరాయి. ఏలూరు జిల్లాలో నైరుతి రుతుపవనాలు ఆధారంగా 765.7 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఈ ఏడాది 1136.1 మిల్లీమీటర్లు వర్షపాతం కురిసింది. సాధారణం కంటే అదనంగా 48.4 శాతం వర్షపాతం నమోదైంది. ఈశాన్య రుతుపవనాలు ఆధారంగా జిల్లాలో సాధారణ వర్షపాతం 181.6 మిల్లీ మీటర్లు నమోదు కావాల్సి ఉండగా 127.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది.

వ్యవసాయానికి ఊతం



జిల్లాలో వ్యవసాయం సంవృద్ధిగా జరగాలంటే రైతులకు పంటరుణాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. రైతులతో పాటు కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇచ్చి రుణాలు అంద జేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. సర్వే ఆధారంగా పరిశీలిస్తే జిల్లాలో 2024 ఖరీఫ్‌లో స్వల్పకాలిక రుణాలు రూ. 4436 కోట్లు, ఇతర వ్యవసాయ రుణాలు రూ. 2933 కోట్లు కలిపి మొత్తం వ్యవసాయానికి రూ. 7369 కోట్లు పంట రుణాలుగా అందజేశారు. జిల్లాలో జనవరి 3వతేదీ నాటికి మొత్తం 75 వేల 560 సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటివరకు 65,184 సిసిఆర్‌సి కార్డులు పంపిణీ చేయటం జరిగింది. లక్ష్యంలో 86 శాతం వరకు కార్డులు పంపిణీ జరిగింది.

పెరిగిన పండ్ల తోటల పెంపకం

జిల్లాలో పండ్ల తోటల పెంపకం పెరుగుతూ వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పండ్ల తోటలకు ప్రోత్సాహాన్ని అందిస్తామని పేర్కొనటంతో విస్తీర్ణం మళ్ళీ పుంజుకుంటోంది. జిల్లాలో మామిడిపంటకు 14 టన్నులు, అరటి 75 టన్నులు, బొప్పాయి 90.5 టన్నులు, స్వీట్ ఆరంజ్ 22 టన్నులు, కొబ్బరి 19 టన్నులు, ఆయిల్‌పామ్ 22.5 టన్నులు, జీడిమామిడి 1.60 టన్నులు, మిరప 5.75 టన్నులు, టమోటో 60 టన్నులు దిగుబడులు లభిస్తున్నాయి.

ఊపందుకున్న ప్రాజెక్టులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోలవరం ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయి. 78.64 శాతం పనులు పూర్తయ్యాయని, 2027 సంవత్సరం నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నట్లు ఆ సర్వే రిపో ర్టులో పేర్కొన్నారు. ప్రాజెక్టు ద్వారా 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. చింత లపూడి ఎత్తిపోతల పథకం 66.43 శాతం పనులు పూర్తయ్యాయని 2026 నాటికి పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్ధేశించుకున్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం పనులు 78 శాతం పూర్తయ్యాయని, 2025 నాటికి పూర్తి స్థాయిలో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా కొత్తగా ఆయకట్టు 47వేల 487 ఎకరాలకు, ఇప్పటికే స్థిరీకరించి ఉన్న ఆయకట్టులో 1569 ఎకరాలకు సాగునీరు అందే అవకాశాలున్నాయని ఆ సర్వే నివేదికలో పేర్కొన్నారు.

అధ్యక్షా..

టీడీఆర్ కుంభకోణం విచారణ ఏమైంది : ఆరిమిల్లి



తణుకు, మార్చి 7(ఆంధ్రజ్యోతి):తణుకు మున్సిపాల్టీలో జరిగిన టీడీఆర్ కుంభకోణంలో విచారణ ఎంతవరకు వచ్చిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రూ.750 కోట్లు విలువైన 29 టీడీఆర్ బాండ్లు జారీచేశారని, ఇదే విషయాన్ని గత అసెంబ్లీలో ప్రస్తావించానని గుర్తుచేశారు. బాండ్లను సీజ్ చేసి చలామణి నిలిపి వేసినప్పటికీ తణుకులో మరోసారి చలామణిలోకి బాండ్లు వచ్చాయని తెలిసిందని వివరించారు. మున్సిపల్ శాఖమంత్రి నారాయణ మాట్లాడుతూ విజిలెన్సు, సీఐడీ విచారణ జరుగుతుందని చెప్పారు.

యార్డ్‌లను భ్రష్టు పట్టించిన వైసీపీ: బొలిశెట్టి



తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డ్‌లను మొత్తం వైసీపీ భ్రష్టు పట్టించిందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో మార్కెట్ యార్డ్‌పై ఏటా రూ.7 కోట్ల ఆదాయం వస్తుందని, ఆదాయంలో 20 శాతం నిధులను ఖర్చు పెట్టుకునే జీవోను తెలుగుదేశం ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. అయితే వైసీపీ హయాంలో ఆ జీవోను పక్కన పెట్టేశారని ఫలితంగా పొలాలకు వెళ్ళే పుంతమార్గాలు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నార న్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి : బడేటి



ఏలూరు టూటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం కట్టించి ఇచ్చిన గృహాలకు మౌలిక సదుపాయాల కల్పనకు, రోడ్లు వేయడానికి రూ.10 కోట్లు కేటాయించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో 18,280 ఇళ్ళు మంజూరు చేసి ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లో 1500 ఇళ్లు పూర్తి చేశామన్నారు. వీటి మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు ఇవ్వాలని కోరారు.



డాక్టర్ విజయనిర్మలను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

రోగ నిర్ధారణ సాధనాలపై అవగాహన

తణుకు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో రోగ నిర్ధారణ సాధనాలపై రెండోరోజు అవగాహన సదస్సు జరిగింది. రాజమహేంద్రవరం కాలేజ్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల చిన్న జబ్బులకు సైతం సొంత వైద్యం మాని వైద్యుని సంప్రదించాలన్నారు. తిరుపతి ఎస్‌వీ వర్సిటీ వైరాలజీ విభాగం ప్రొఫెసర్ జి.నరసింహ మాట్లాడుతూ ప్రకృతిలో దొరికే పసుపు, తులసి ఎన్నో వ్యాధి కారక వైరస్‌లను నాశనం చేస్తాయన్నారు. విజయ నిర్మలను కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీసుందరీబాయ్, డాక్టర్ ఎం. శ్రీదేవి, డా.కె.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆకివీడు-దిగమర్రు రహదారికి భూసేకరణ

భీమవరం టౌన్ : ఆకివీడు - దిగమర్రు హైవే నిర్మాణానికి భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం భూ సేకరణకు అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈసారి ఏం చేస్తారో ?

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీపై తీవ్ర ఉత్కంఠ
ఉమ్మడి పశ్చిమలో అరడజనుపైగా ఆశావహులు
ప్రతీసారి ఛాన్స్ కోసం ఎదురుచూపులే
ఈసారైనా కనికరించకపోతారా అనే ఆశ
ప్రయత్నాల్లో పార్టీ సీనియర్లు



ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీల ఎన్నిక మరొకసారి టీడీపీ ఆశావహులకు పరీక్ష పెడుతుంది. ఇప్పటికే అతి తక్కువ స్థానాలు ఖాళీ అవడం, ఆ స్థానాలు ఆశిస్తున్న వారి సంఖ్య అత్యధికంగా ఉండడంతో పార్టీలో ఉత్కంఠ నెలకొంది. రెండు దఫాలుగా అదిగో ఇదిగో అంటూ అనేకమంది ఆశ పెంచుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన, టీడీపీ సీట్ల సర్దుబాటులో భాగంగా కొంతమంది టీడీపీ సీనియర్లు త్యాగాలకోర్చారు. అప్పట్లో ఆయా స్థానాలను జనసేనకు కేటాయించడంతో ఎమ్మెల్సీ పదవుల్లో సర్దుబాటు చేస్తామంటూ అధిష్ఠానం కాస్తంత భరోసా ఇచ్చింది.

ఈ సారైనా ఛాన్స్ దక్కేనా

ఉమ్మడి పశ్చిమలో ఈసారైనా ఎవరైనా ఎమ్మెల్సీ అవుతారా.. కారా అనే సందిగ్ధత, టెన్షన్ అన్ని నియోజకవర్గాల్లో కనిపిస్తుంది. సాధారణంగా పార్టీ నాయకత్వం ఓ నిర్ణయం తీసుకోవడం, ఆ తదుపరి ఎవరికి ఏ సమయంలో ఛాన్స్ ఇవ్వాలో ఖరారు చేసుకుంటారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిసారి ఇలాంటి ఉత్కంఠే నెలకొంటుంది. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమలో ఎమ్మెల్సీ స్థానాలు ఆశిస్తున్న వారిలో ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఒకరు. ఆయనతోపాటు మాజీ మంత్రి పీతల సుజాత, కె.ఎస్.జవహర్, మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జీ సైతం ఎమ్మెల్సీ ఆశావహుల జాబితాలో ఉన్నారు. ఉమ్మడి పశ్చిమలో తొలి అవకాశం గన్ని వీరాంజనేయులుకు దక్కుతుందని మొదటి నుంచి అంచనా వేస్తున్నారు. సామాజిక సర్దుబాట్ల నేపథ్యంలో గన్నికి ఇప్పటిదాకా అవకాశం దక్కలేదు. ఉంగుటూరు నుంచి పోటీ చేయాలనుకుని ఆ స్థానం జనసేనకు కేటాయించడంతో పార్టీ ఆదేశాల మేరకు సీటు త్యాగం చేశారు. అప్పట్లోనే పార్టీ అధినాయకత్వం మీకు తగినంత ఛాన్స్ ఇస్తాం, వీలైతే ఎమ్మెల్సీ కోటాను పరిగణనలోకి తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అప్పటి నుంచి గన్ని అనుచరులంతా తమ నాయకుడికి ఎమ్మెల్సీ సీటు ఎప్పుడు కేటాయి స్తారంటూ పదేపదే నాయకత్వాన్ని ప్రశ్నిస్తూనే వస్తున్నారు. ఈ విషయంలో సామాజిక పరమైన అంశాన్ని పక్కనపెట్టి పనితీరు, క్రమశిక్షణను పరిగణనలోకి తీసుకుని తీరాల్సిందేనని కోరుతున్నవారు. ఈసారి రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కావడంతో ఆ స్థానాలను భర్తీ చేయబోతున్నారు. నియోజకవర్గమైన ఉంగుటూరుతో పాటు ఏలూరు జిల్లాలోని కేడర్‌లో ఇప్పటికే ఉత్కంఠ. నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు సైతం గన్ని వీరాంజ నేయులు బాటలోనే సీటు త్యాగం చేసి పార్టీలో మిగిలి పోయారు. ఆయన వర్గీయులు సైతం తమ నాయకుడు శేషారావుకు తగినంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని చాన్నాళ్ళుగా కోరుతూనే వస్తు న్నారు. ఈసారి శేషారావుకు అవకాశం ఇస్తారా, లేకుంటే ఏమైనా నామినేటెడ్ పోస్టుతో సరిపెడతారా అనేది పార్టీలో చర్చ సాగుతుంది. మరో సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు పేరు కూడా ఈ మధ్యన అడపాదడపా చర్చకు వస్తూనే ఉంది. చాన్నాళ్ళ పాటు ఆయన పార్టీలో ఫైర్‌బ్రాండ్‌గా ఉన్నారు.

మాజీల సంగతేంటి

మిగతా నేతల మాదిరిగానే ఉమ్మడి పశ్చిమలో ఒకనాడు ఒక వెలుగు వెలిగిన మాజీ మంత్రులు కూడా ఎమ్మెల్సీ స్థానాలను ఆశిస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి అవకాశం వస్తే ఆ ఛాన్స్ తమకే వస్తుందన్న విశ్వాసంతో ఉన్నారు. మాజీ మంత్రి కె.ఎస్.జవహర్, మరో మాజీ మంత్రి పీతల సుజాత పార్టీలో కీలక స్థానాల్లోనే ఉన్నా కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వీరికి ఎలాంటి పదవులు కట్టబెట్టలేదు. పీతల సుజాతకు నామినేటెడ్ చైర్మన్ పదవి ఇచ్చినా కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఆ పదవి ఆమెకు కట్టబెట్టలేకపోయారు. అప్పటి నుంచి తనకో ఛాన్స్ ఇవ్వాలని యువనేత నారా లోకేష్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అభ్యర్థిస్తూనే ఉన్నారు. పార్టీలో చురుగ్గా వ్యవహరించడం, పదవి ఉన్నా, లేకపోయినా తమకు అప్పగించిన బాధ్యతను నెరవేర్చడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని పీతల సుజాత మనోభిప్రాయం. మరో వైపు ఇంకో మాజీ మంత్రి కె.ఎస్ జవహర్ అనుకూలురు కూడా తమ నాయకుడికి సరైన ప్రాధాన్యం కల్పించాలని గట్టిగానే కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీ వర్గాలకు అవకాశం ఇస్తే ఆ ఛాన్స్ జవహర్‌కే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే మాజీ మంత్రుల విషయంలో టీడీపీ అధిష్ఠానం వైఖరి ఏమిటనేది ఇప్పటికీ అంతుపట్టడం లేదు.ఇదిలా ఉండగా జనసేన నుంచి నాగబాబుకు ఎలాగూ పోటీకి దిగుతున్నారు. అయితే బీజేపీ నుంచి తమకో స్థానం కేటాయించాలని స్థానికంగా డిమాండ్ తలె త్తుతోంది. పార్టీలో సీనియర్ నేత పాకా సత్యనారాయణ పేరు తెరముందుకొచ్చింది. సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలు అందిస్తున్న ఆయన నామినేటెడ్ పదవులను కూడా చేపట్టలేదు. కేవలం పార్టీపరమైన పదవుల్లోనే ఉంటూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వంలో బీజేపీకి ఒక స్థానం కేటాయిస్తే పాకా సత్యనారాయణకే అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ ఆ పార్టీలో వినిపిస్తోంది.

ఆచంటలో నేడు జైన్ మందిరం ప్రతిష్ఠ

ఆచంట, మార్చి7(ఆంధ్రజ్యోతి):ఆచంటలో నూతనంగా నిర్మించిన రాజేంద్ర సూరీశ్వరీజీ గురు ద్యాన జైన్ మందిరం ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జైన్ గురువులు, భక్తులు విచ్చేశారు. ఈ నెల 8, 9 తేదీల్లో ప్రతిష్ఠ మహోత్సవాలు జరగనున్నాయి. శుక్రవారం జైన్ మందిరంలో జలపూజ, శాంతి పూజ వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జైన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







విద్యుద్దీపాల వెలుగుల్లో జైన మందిరం

పూజలు చేస్తున్న జైన్ భక్తులు



విద్యార్థులకు మెమెంటోలను అందజేస్తున్న రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి

నిట్‌లో బయో ప్రింటింగ్‌పై ముగిసిన శిక్షణ

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జీవ కణాల అభివృద్ధే 3డీ ప్రింటింగ్ అని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. నిట్‌లో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న నెక్స్ జెన్ బైఫాబ్రికేషన్ ఇన్నోవేషన్ ఇన్ 3డీ బయో ప్రింటింగ్ అండ్ ఫంక్షనల్ బయో మెటీరియల్స్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. బయో ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతులు డాక్టర్ సుదర్శన దీప, డాక్టర్ వినోత్‌కుమార్ రాజా విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆచార్యులు డాక్టర్ శారద ప్రసన్న మాలిక్, డాక్టర్ వందన కుమారి కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ అందిస్తున్న మాజీ రిజిస్ట్రార్ దండు, వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, తదితరులు

తేనెటీగల పెంపకంతో మంచి ఆదాయం

ఉండి, మార్చి 7(ఆంధ్రజ్యోతి):తేనెటీగల పెంపకంతో మంచి ఆదాయాన్ని ఆర్జించవచ్చునని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూని వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ దండు జగన్నాథరాజు అన్నారు. ఉండి మండలం ఎన్‌ఆర్‌పీ అగ్రహారంలోని కేవీకేలో నిర్వహిస్తున్న తేనెటీగల పెంపకంపై శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ప్రోగ్రాం కోఆర్డి నేటర్ డా.మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ దండు జగన్నాథరాజు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు అందిస్తున్న సూచనలతో తేనెటీగల పెంపకాన్ని చేపడితే మంచి ఆదాయాలు వస్తాయ న్నారు. శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందించారు. గోదావరి మండల పరిశోధన సహ సంచాలకుడు శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు మెషియానా డిబోరా, శ్రీనివాసరావు, ఆర్.బిందు ప్రవీణ, వినయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందులతో డబ్బు ఆదా: మంత్రి వర్మ



జనరిక్ మెడికల్ షాపును పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్ర (జనరిక్ మందులు షాపు) ద్వారా నాణ్యమైన అన్ని రకాలు మందులు కొనుగోలుపై 80 శాతం డబ్బులు ఆదా అవుతుందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. శుక్రవారం కోపల్లెవారి కాంప్లెక్సులో జన రిక్ మందులు షాపును మంత్రి శ్రీనివాస వర్మ, కలెక్టరు చదలవాడ నాగరాణి సందర్శించారు. షాపులో ఉన్న అన్ని రకాల మందులను పరిశీలించి, కొనుగోలు దారులతో వారు మాట్లాడారు. జనరిక్ మందులపై ప్రజల్లో అపోహలు అనుమా నాలు ఉన్నాయని, వీటిని తొలగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జనరిక్ షాపుల ఏర్పాటుకు నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని, అర్హతలను పరిశీలించి వెంటనే అనుమ తులు మంజూరు చేస్తామన్నారు. జనరిక్ షాపు నిర్వాహకులు జి.చంద్రసుధీర్, జి.రాధ పాల్గొన్నారు.

ఆయుధాలపై విద్యార్థినులకు అవగాహన

భీమవరం క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులతో మమేకమయ్యారు. పోలీసులు వినియోగిస్తున్న ఆయుధాలు, సాంకేతికత, డ్రోన్స్, కమ్యూనికేషన్ పరికరాల గురించి ఆయన వివరించారు. అలాగే విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రతే ప్రాధాన్యతగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

బస్సు డ్రైవర్ మృతదేహం అప్పగింత

ఏలూరు క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు బస్సు ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ మృతదేహానికి శుక్రవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. శ్రీకాకుళం జిల్లా ములగవలస గ్రామానికి చెందిన ముంగంటి మధుసూధనరావు (38) 10 ఏళ్ళ నుంచి కాకినాడలో ఉంటూ రమణా ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ చొదిమెళ్ళ వద్ద జాతీయ రహదారి మధ్యలో పంచర్ అయి ఆగిపోయిన సిమెంటు లారీని రమణ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తూ ఈనెల 6వ తేదీ వేకువజామున ఢీ కొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మధుసూధనరావు, మరో ముగ్గురు ప్రయాణికులు మరణించారు. మృతుని ఆచూకీ గురువారం రాత్రి ప్రొద్దుపోయిన తరువాత గుర్తించారు. బంధువులు శుక్రవారం ఉదయం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకు న్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏలూరు రూరల్ ఎస్‌ఐ సిహెచ్‌కె దుర్గా ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ మాతంగి జీవరత్నంలు శవపంచనామా నిర్వహించి పోస్టు మార్టం జరిపించి బంధువులకు అప్పగించారు.

పెళ్లి బృందం వ్యాన్ బోల్తా

పలువురికి స్వల్పగాయాలు



రాజానగరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుని సన్నిధిలో వ్రతం జరిపించేందుకు పయనమైన వ్యాన్ మార్గమధ్యలో జాతీయ రహదారిపై తూర్పుగోనగూడెం వద్ద బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా పెదవేగి మండలం జయపురం గ్రామం నుంచి నూతన వధూవరులు, బంధుగణంతో వ్యాన్‌లో అన్నవరం సత్యదేవుని దర్శనానికి బయ ల్దేరారు. మార్గమధ్యలో తూర్పుగోనగూడెం వద్దకు చేరు కునే సరికి వ్యాన్ స్టీరింగ్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నూతన వధూవరులకు గాయాలేమీ కాలేదు. స్వల్పగాయాలైన కొందరికి 108 అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. సమా చారం అందుకున్న రాజానగరం ఏఎస్‌ఐ మణి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం బంధువులంతా అన్నవరం వెళ్లారు.

తాళం వేసిన ఇళ్లల్లో చోరీలు



పెదవేగి మండలంలో బీరువా తెరిచిన దొంగలు

పెదవేగి, మార్చి 7(ఆంధ్రజ్యోతి):రెండిళ్ళలో చోరీ జరిగింది. ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. పెదవేగి మండలం తాళ్ళగోకవరం గ్రామానికి చెందిన యలమర్తి దుర్గారావు నాలుగురోజుల క్రితం ఇంటికి తాళం వేసి, కుటుంబంతో సహా అరుణాచలం వెళ్ళారు. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి బీరువాలో పది కాసుల బంగారు ఆభరణాలు, రూ.2లక్షల నగదుతోపాటు విలువైన భూమి పత్రాలు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయరాయి గ్రామానికి చెందిన గంగిరెడ్ల సాయిబాబు నిడదవోలులో బంధువుల ఇంట్లో పెళ్ళికి గురువారం వెళ్ళారు. శుక్రవారం వచ్చేసరికి బీరువాను పగులగొట్టి, రెండు బంగారు ఉంగరాలు, బ్రేస్‌లెట్, రూ.20వేలు నగదు కనిపించలేదు. కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

అయితంపూడిలో చోరీ

ఇరగవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి):తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం ఇరగవరం మండలం అయితంపూడిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయితంపూడి గ్రామానికి చెందిన చెన్నం రామకృష్ణ ఇటీవల నూతన గృహం నిర్మించుకున్నాడు. పాత ఇంటిలో సామగ్రి ఉంచి కొత్త ఇంటిలో కాపురం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం ఐదు గంటలకు లేచి పాత బిల్డింగ్ వద్దకు వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి వుంది. బీరువాలో కాసు బంగారం, కొంత నగదు అపహరణకు గురైనట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ జానా సతీశ్ తెలిపారు.

హార్డ్‌వేర్ షాపుల్లో తనిఖీలు : కేసులు నమోదు



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఏలూరు క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విజిలెన్సు ఎస్‌ఐ సీతారామ్, తూనికలు కొలతల అధికారి ప్రశాంత్‌కుమార్, సిబ్బంది కలిసి ఏలూరులోని శ్రీలక్ష్మి గృహశోభ హార్డ్‌వేర్ షాపు, శ్రీ రామకృష్ణ హోమ్ మార్టులను శుక్రవారం తనిఖీలు చేశారు. ఆ షాపులో ఉన్న వస్తువులపై తయారు తేదీ, తయారు దారుని చిరునామా గరిష్ట చిల్లర ధర, వినియోగదారుల సేవా ఫోన్ నెంబర్ వంటి సమాచారం లేకుండా వస్తువులు ఉండడాన్ని గుర్తించారు. వీటిలో వివిధ రకాల డోర్ లాక్స్, హ్యాండిల్స్, గమ్ డబ్బాలు, కిచెన్ బాస్కెట్లు వంటి వాటిని గుర్తించారు. దీంతో రెండు షాపులపై ఐదు కేసులు నమోదు చేశారు.

• **రేషన్ షాపు తనిఖీ**

విజిలెన్సు తహసీల్దార్ వి.కన్యాకుమారి, విజిలెన్సు ఏవో మీరయ్య, విజిలెన్స్ ఎస్‌ఐ కె.సీతారామ్, ఆర్‌ఐ శ్రీను నాయక్, వారి సిబ్బంది కలిసి ఏలూరు ఎమ్మార్సీ కాలనీలో ఉన్న పౌరసరఫరాల దుకాణం నెంబర్ 0581038 షాపును తనిఖీ చేశారు. ఈ షాపులో బియ్యం, పంచదార, కందిపప్పు సరుకులలో వ్యత్యాసాలు ఉండడాన్ని గుర్తించారు. దీంతో డీలర్‌పైన, ఆమె భర్తపైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్టు

జంగారెడ్డిగూడెం(ఏలూరు) మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో ఈ నెల ఐదవ తేదీన రిటైర్డ్ ఉర్దూ టీచర్ షేక్ ఫాతీమున్నీసా బేగం ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు చొరబడి బలవంతంగా ఆమె నుంచి బంగారు గాజులు దోచుకుపోయిన కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. సీఐ కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ యు.రవిచంద్ర విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. బుట్టాయగూడెం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన గుత్తి శ్రీనివాసరావు, జంగారెడ్డిగూడెం పట్టణం ముస్లీం పేటకు చెందిన మహమ్మద్ అలీషాలను అరెస్టు చేసి వారి నుంచి మూడు బంగారు గాజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తెలంగాణకు చెందిన మరొక వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ కృష్ణబాబు, ఎస్‌ఐ ఎస్‌కె.జబీర్ పాల్గొన్నారు.

నిర్వాసితుల కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ

బుట్టాయగూడెం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చాగరపల్లి నిర్వాసితుల కాలనీలో ఏర్పాటు చేసిన రెండు మినీ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. కాలనీలో నిర్వాసితులు కోసం గృహాలను నిర్మించి అన్ని సౌకర్యాలను కల్పించినా ఎవరూ రాకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. కాలనీలు చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారినట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఎవరూ ఉండక పోవడాన్ని గుర్తించిన కాపర్‌వైర్ దొంగలు శుక్రవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించారు. విద్యుత్ ఏఈ శ్రీనివాసవర్మ దొంగతనానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు

బుట్టాయగూడెం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో భర్త పందు సాయికిరణ్‌ను శుక్రవారం పందిరిమామిడిగూడెంలో జీలుగుమిల్లి సీఐ ఎం.వెంకటేశ్వరావు అరెస్టు చేశారు. బూరుగువాడలో మూడు రోజుల క్రితం భార్య గొడ్డ రేఖమాధవిని అనుమానంతో గొంతునులిమి చంపాడని మృతురాలి తండ్రి శ్రీను ఫిర్యాదు చేశాడు. నిందితుడిని సీఐ అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

వీఆర్వో అనుమానాస్పద మృతి



మండవల్లి మార్చి 7(ఆంధ్రజ్యోతి): పులపర్రు వీఆర్వోగా పనిచేస్తున్న డీవీ వెంకటే శ్వరరావు (52) అనుమానాస్పదస్థితిలో చెరువులో పడి మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం వరకు గ్రామంలోనే ఆయన ఉన్నారు. ఆ తర్వాత అతని ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గాలింపు చేపట్టగా పులపర్రు మంచినీటి చెరువులో శుక్రవారం మధ్యాహ్నం మృతదేహం కన్పించింది. మూత్ర విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెంది ఉంటారని అనుమా నిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

మొగల్తూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేసినట్టు మొగల్తూరు ఎస్‌ఐ వై.నాగలక్ష్మి తెలిపారు. ఆమె కథనం ప్రకారం పీఎం లంక గ్రామానికి చెందిన పొన్నాల లక్ష్మి(29) శుక్రవారం ఆమె ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందిందన్నారు. మృతురాలి భర్త నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి



జంగారెడ్డిగూడెం (ఏలూరు) మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుట్టాయగూడెం రోడ్డులో ఓ దుకాణం పైభాగాన పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు షేక్ ఆరిఫ్ (40)ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. మృతుడు విజయవాడకు చెందిన వ్యక్తిగా చెబుతున్నారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

ఏలూరు క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలం కొమడవోలు గ్రామానికి చెందిన కాకర్ల నాగార్జున (28) ఏలూరు మార్కెట్‌యార్డు గేటు వద్ద శుక్రవారం రైలు పట్టాలుదాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ తన సిబ్బందితో సంఘటనాస్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి బంధువులకు అప్పగించారు.

గురుకులంలో ప్రవేశానికి గడువు పెంపు

ద్వారకాతిరుమల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక డా. బీఆర్ అంబేద్కర్ గురుకులంలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఐదవ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే చివరి తేదీని 13కు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి తెలిపారు. ఐదవ తరగతి ప్రవేశానికి నాల్గవ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, రే షన్‌కార్డు, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి పదవ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, రేషన్‌కార్డులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు పునశ్చరణ తరగతులు

ఏలూరు అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయ మీటింగ్ హాలులో అడ్వాన్స్ ల్యాబ్ పరీక్షలపై రెండురోజుల జిల్లాస్థాయి పునశ్చరణ శిక్షణ శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎల్టీలందరూ మంచి నైపుణ్యంతో రక్తపరీక్షలు నిర్వహించినట్టయితే ఖచ్చితమైన వ్యాధినిర్ధారణ సాధ్యమవుతుందని అన్నారు. స్టేట్ రిజర్వ్‌డ్ ల్యాబ్ టెక్నీషియన్ కళ్యాణి, మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు

10న వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవం

కామవరపుకోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : గుర్రాలచెరువు గట్టుపై గల 42 అడుగుల ఎత్తు గల వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద ఈనెల 10వ తేదీన ఎనిమిదవ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, వెంకట సత్య శ్రీనివాసాచార్యులు, మతుకుమల్లి వేణు లక్ష్మి ప్రసన్న తెలిపారు. ఆరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ జరుపుతారని తెలిపారు.

పల్లాలమ్మ ఆలయ వార్షికోత్సవం

ఉంగుటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాచూరు గ్రామంలో పల్లాలమ్మ ఆలయ 18వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

14న మహాలక్ష్మి అమ్మవారి జయంతి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మి ఆలయం వద్ద ఈనెల 14వ తేదీన మహాలక్ష్మి అమ్మవారి జయంతి మహోత్సవాన్ని, శ్రీ లక్ష్మీనారాయణ కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు చిన్నబాబు, పోతురాజు, ప్రవీణ్ తెలిపారు. ఆరోజు అమ్మవారికి పంచామృతాభిషేకం, హోమం, సాయంత్రం లక్ష్మీనారాయణ కల్యాణం, భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

20 నుంచి సాయి ప్రేమమందిర్ వార్షికోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆదివారపుపేటలోని శ్రీ షిరిడీసాయి ప్రేమమందిర్ ఆరవ వార్షికోత్సవాన్ని ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ శాశ్వత ధర్మకర్త ఇసుకపల్లి తాతారావు తెలిపారు. ఈ ఉత్సవాల్లో బాబా వారికి ఉదయం, సాయంత్రం వేళల్లో విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామని తెలిపారు.

14 నుంచి గుబ్బల మంగమ్మ తల్లి ఉత్సవాలు

బుట్టాయగూడెం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గుబ్బల మంగమ్మతల్లి ఉత్సవాలను ఈ నెల 14 నుంచి 16 వరకు ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ ఉత్సవాలకు సహకరించాలని శుక్రవారం కెఆర్‌పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్‌ను కమిటీ కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించింది.

నేటి నుంచి పీ4 సర్వే

ఉంగుటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీ4సర్వేను శనివారం నుంచి ప్రారంభించాలని ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సచివాలయాల సిబ్బంది శిక్షణలో ఆయన మాట్లాడారు. శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి యువరాజును తొలగించాలి

ఉంగుటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ స్థలాన్ని భార్యకు బహుమతిగా ఇచ్చిన ఘటనపై టీడీపీ ఎస్సీ సెల్ ప్రతినిధి గంటా యువరాజుపై పార్టీ నాయకత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వార్త ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు యువరాజును పార్టీ నుంచి తొలగించాలని సిఫారసు చేస్తూ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులకు లేఖను ఉంగుటూరు మండల టి.డి.పి.అధ్యక్షుడు పాతూరి విజయకుమార్ రాశారు. యువరాజు పార్టీలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని అతని పై నిజాలు నిగ్గు తేల్చాలని విజయకుమార్ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

జలశక్తి మిషన్ పథకంపై లఘు చిత్రం



డాక్యుమెంటరీ తీస్తున్న దృశ్యం

దెందులూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెంలో కేంద్ర బృందం పర్యటించింది. జలశక్తి జలజీవన మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా గోపన్నపాలెం పంచాయతీ ఎంపికై పనులు పూర్తయిన నేపథ్యంలో వేగవరం, కొత్తపల్లి, మసీదుపాడు గ్రామాల్లో కేంద్ర బృందం పరిశీలించింది. ఈ పథకంపై లఘు చిత్రం(డాక్యుమెంటరీ) తీశారు. వారితో పాటు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ త్రినాథ్ బాబు, ఏఈ చింతమనేని వర్మ, కార్యదర్శి స్టాలిన్‌బాబు పాల్గొన్నారు

సమస్యలపై ఆందోళనకు సీపీఎం సమాయత్తం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధమయ్యామని సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 8 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సమస్యలపై అధ్యయనం చేస్తామని, 16 నుంచి 23 వరకు ప్రజాచైతన్య యాత్ర నిర్వహించి, 24 నుంచి 29 వరకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించేందుకు సిద్ధమయ్యామని చెప్పారు. సూపర్-6 వాగ్దానాల్లో ముఖ్యమైన ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించాలని, ఉగాది నాటికి యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు 1500 రూపాయలు అమలు ప్రకటించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, ఆర్.లింగరాజు, డి.ఎన్.వి.డి.ప్రసాద్, తెల్లం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో డిగ్రీ కళాశాల పరిశీలన

చింతలపూడి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక, విద్యా సదుపాయాలను శుక్రవారం జోన్-2 రాజమహేంద్రవరం ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి పరిశీలించారు. ఈ కళాశాలకు నాక్ పరిశీలనలో బి ప్లస్ గ్రేడు వచ్చినందుకు పాఠశాల యాజ మాన్యాన్ని అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు రచించిన ఖమ్మం జిల్లా ఆదివాసి విజ్ఞానం అనే పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు.

ఫైలేరియా రోగులకు కిట్‌ల పంపిణీ

చింతలపూడి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఫైలేరియా రోగులకు ఎంఎంబీపీ కిట్‌లను పంపిణీ చేశారు. సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ దోమ పుట్టకూడదు.. దోమ కుట్టకూడదనే కార్యక్రమం ద్వారా ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఈ కిట్‌లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఎస్‌బీఐ సిబ్బంది రక్తదానం



జంగారెడ్డిగూడెం,(ఏలూరు) మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎ.రాజేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద వైద్య, రక్తదాన శిబిరాన్ని శుక్రవారం టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, వైసీపీ నాయకుడు బత్తిన చిన్నా సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారు. మున్సిపల్ సిబ్బందితో పాటు ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని ఉపయోగించుకున్నారు. వివిధ రంగాలలో సేవలందిస్తున్న వంద మంది మహిళలకు చీరలు పంపిణీ చేయడంతో పాటు మున్సిపల్ పారిశుధ్య మహిళా కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, ఎస్బీఐ లోకల్ సెక్రటరీలు సూర్యప్రసాద్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ వినియోగంపై చర్యలు తీసుకోవాలి

కుక్కునూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న జామాయిల్ నర్సరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కుక్కునూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని దాదాపు 500కు పైగా జామాయిల్ నర్సరీలు ఏర్పాటు చేసి ఎటువంటి అనుమతులు లేకుండా నర్సరీ యాజమానులు విద్యుత్‌ను వినియోగిస్తున్నారని అన్నారు. అక్కడ జామాయిల్ నర్సరీ ఏర్పాటు చేసిన భూములన్ని గిరిజనులవన్నారు. ప్రభుత్వం ఈ అక్రమ నర్సరీలపై దృష్టి పెట్టాలని కోరారు.నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు.







జేసీ ధాత్రిరెడ్డిని సత్కరిస్తున్న సీఆర్‌ఆర్ కళాశాల యాజమాన్యం.. విద్యుత్‌శాఖలో మహిళా ఉద్యోగులకు సన్మానం.. సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో ఉద్యోగులకు సన్మానం

సమాన హక్కుల సాధనతోనే మహిళా సాధికారత

జిల్లా అంతటా ఘనంగా మహిళా దినోత్సవం

ఏలూరుఅర్బన్/ఉంగుటూరు/పెదవేగి/ఏలూరు రూరల్/ పెదపాడు /ద్వారకాతిరుమల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళల సమాన హక్కులు, సామాజికప్రభావం, వారి సాధికారతగురించి తెలియజేశారు. మహిళలు తమ లక్ష్యాలను సాధించేందుకు ధైర్యంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఎ.లావణ్య ప్రసంగించారు. విశేషసేవలందించిన మహిళా ఉద్యోగులను బెస్ట్ ఉమెన్ ఎంప్లాయి పురస్కారాలతో సత్కరించారు. సీఆర్‌ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు పాల్గొన్నారు. కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థినులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నారాయణపురం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఉద్యోగినులు హెప్సీబా, లావణ్య, గట్టు కళ్యాణి, ధనలక్ష్మి తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ రెడ్డియ్య, కొండా రవి పాల్గొన్నారు. దుగ్గిరాలలోని ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా ప్రొఫెసర్లు, ఇతర మహిళా సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. కళాశాల చైర్మన్ వనమా రాఘవేంద్రరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాలకృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఏలూరులోని విద్యుత్ భవనంలో తొలుత కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన 34 మంది మహిళా ఉద్యోగులను అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ పి.సాల్మన్‌రాజు, ఈఈలు పాల్గొన్నారు. వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టరు డి.సరస్వతి, కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ జి.సరళ, ఝాన్సీలక్ష్మి, శబరికుమారి పాల్గొన్నారు. ద్వారకాతిరుమల యూటీఎఫ్ భవనంలో వేడుకలు జరిగాయి. మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఏపీవో అరవింద, సర్పంచ్ బండారు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రం ఆసుపత్రిలో లైవ్‌సర్జరీల వర్క్‌షాప్

ఏలూరు టూటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆశ్రం మెడికల్ కాలేజీ రజతోత్సవాల్లో భాగంగా శుక్రవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు ఎండోస్కోపిక్ సైనస్ సర్జరి, లైవ్‌సర్జికల్ అండ్ కెడరిక్ హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు సీఈఓ డాక్టర్ హనుమంతరావు తెలిపారు. కళాశాలలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఈ వర్క్‌షాపుకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 100మంది డాక్టర్లు విచ్చేస్తున్నారని తెలిపారు. రాబోయే ఈఎన్‌టీ సర్జన్లకు మార్గనిర్దేశం చేయడానికి పరిజ్ఞానం అందించడానికి ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్‌లు ఈ వర్క్‌షాపుకు హాజరవుతున్నారని అన్నారు.

ఎమ్మెల్యే చంటికి సమస్యలపై వినతులు

ఏలూరు టూటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే చంటి అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే కొన్ని సమస్యలు పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నవోదయం పోస్టర్ ఆవిష్కరణ

ద్వారకాతిరుమల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలన కోసం ఏర్పాటైన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ద్వారకాతిరుమల మండల కార్యాలయం వద్ద నవోదయం 2.0 పోస్టర్‌ను అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. భీమడోలు ఎక్సైజ్ సీఐ బి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దారు జేవీ సుబ్బారావు, ఈవోపీఆర్‌డీ ఏవీ సుబ్బరాయన్, ఎస్ఐ టి సుధీర్ పాల్గొన్నారు.

విద్యార్థి నాయకులపై కోర్టుకేసు కొట్టివేత

ఏలూరు అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఓ విద్యార్థికి సర్టిఫికెట్లు ఇవ్వనికారణంగా స్థానిక ఎన్‌ఆర్ పేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో గతేడాది నవంబరులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనకు సంబంధించి విద్యార్థి సంఘాల నాయకులపై కళాశాల యాజమాన్యం పెట్టిన పోలీసు కేసును శుక్రవారం ఏలూరులోని ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు కొట్టివేసిందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నంపై కళాశాలవద్ద పీడీఎస్‌యూ, వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన నేపథ్యంలో కళాశాల యాజమాన్యం విద్యార్థి సంఘాలనాయకులపై కేసుపెట్టగా, ఆరోపణలను యాజమాన్యం రుజువుచేయలేకపోవడంతో కేసును కొట్టి వేశారని విద్యార్థి సంఘాల నాయకులు శివరావు, క్రాంతి వివరించారు.

ప్రైవేటు స్కూలు నిర్వాకంపై వాగ్యుద్ధం

ఏలూరు అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు స్కూలులో అనారోగ్యంతోవున్న బాలికను నేలపై కూర్చోబెట్టారన్న ఆరోపణలపై పాఠశాల యాజమాన్యం, విద్యార్థిని తల్లితండ్రుల మధ్య నెలకొన్న వాగ్వాదం శనివారం సోషల్‌మీడియాలో వైరల్ అయింది. శుక్రవారం స్కూలులో చోటుచేసుకున్న ఈ సంఘటనపై విచారణాధికారిగా ఏలూరు డీవైఈవోను డీఈవో వెంకటలక్ష్మమ్మ నియమించారు. ఈ నేపథ్యంలో శనివారం బాలిక తల్లితండ్రులు, స్కూలు యాజమాన్యం డీఈవో కార్యాలయ భవనంలోని డీవైఈవో కార్యాలయానికి మూకుమ్మడిగా ఒకేసారి తరలిరాగా పరస్పర ఆరోపణలతో కార్యాలయ ప్రాంగణం దద్దరిల్లింది. దీనిపై డీఈవో వెంకటలక్ష్మమ్మ వివరణ ఇస్తూ 'నగరంలోని వేరియంట్ స్కూలు యాజమాన్యంపై బాలిక తల్లితండ్రులు విద్యాశాఖకు, పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. డీవైఈవో విచారణ నివేదికనుబట్టి స్కూలు యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీచేసి, తదుపరి చర్యలు తీసుకుంటాం'అని వివరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

వేలేరుపాడు, మార్చి7 (ఆంధ్రజ్యోతి): వేలేరుపాడు మండలంలో అనేక గ్రామాల్లో మంచినీటి సమస్య ఏర్పడిందని, అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపందా జిల్లా కార్యదర్శి ఎస్‌కే.గౌస్ అధికారులను కోరారు. శుక్రవారం నాడు కొర్రాజులగూడెం గ్రామంలో ఆ పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది పెదవాగు ప్రాజెక్టు గండిపడటం కారణంగా దిగువ గ్రామాలైన కమ్మరిగూడెం, మేడేపల్లి, అల్లూరినగర్, కోయమాదారం, ఒంటిబండ, రామవరం, చెరువుగొల్లగూడెం, గుళ్ళవాయి, రెడ్డిగూడెం, పందలబోరు గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే విద్యుత్ మోటార్లు, వరదలకు కొట్టుకుపోవడంతో ఈ గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు.

పేదవాడి సొంతింటి కల సాకారం చేస్తాం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు సాకారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పలువురు ఇళ్ళ స్థలాల కోసం వినతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను సాకారం చేయడాన్ని కూటమి ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మంచినేని శ్రీనివాసరావు, తాతా సత్యనారాయణ, కొనకళ్ళ శివమణి, మాగంటి నారాయణప్రసాద్ పాల్గొన్నారు.

క్షత్రియ సంస్థ డైరెక్టర్ నంబూరి ప్రమాణ స్వీకారం

జంగారెడ్డిగూడెం,(ఏలూరు) మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు విజయవాడలో రాష్ట్ర క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. సంస్థ చైర్మన్ కనకరాజు సూరితో పాటు డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.



మల్లన్నకు మొక్కులు చెల్లించిన మహిళలు

పెదవేగి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బాపిరాజుగూడెం గ్రామానికి చెందిన మహిళలు గురువారం రాత్రి శ్రీశైలం బయలుదేరి వెళ్ళి, శుక్రవారం ఉదయం మల్లన్న, భ్రమరాంబికా దేవిలను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావాలని ఏడాది క్రితం ఆ గ్రామ మహిళలు శ్రీశైలం మల్లన్నకు మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ మాజీ సర్పంచ్ బొప్పన సుధాకర్, ఉపసర్పంచ్ బొల్లిన రాధా సురేష్ ఆధ్వర్యంలో 200మందికి పైగా మహిళలు ప్రత్యేక బస్సుల్లో శ్రీశైలానికి చేరుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ఏలూరు రూరల్,మార్చి 7 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బీసీసంక్షేమశాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ-2025 పరీక్షలకు టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈబీసీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ కోసం ఈనెల 10వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా బీసీసంక్షేమ సాధికారిత అధికారి ఆర్.వి నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వారి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, టీటీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జిరాక్స్‌కాపీలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు పోస్టుద్వారా లేదా స్వయంగా జిల్లా బీసీ సంక్షేమ అధికారి కలెక్టరేట్ కాంపౌండ్ కార్యాలయంలో గడువులోగా సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారానికి 8686180018 నెంబర్లో సంప్రదించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

జనసేన కార్యకర్తల సమావేశం

ఏలూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):దెందులూరు నియోజకవర్గ జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయ ఆత్మీయ సమావేశం శుక్రవారం ఆ నియోజకవర్గ సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఏలూరుజనసేన పార్టీ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డిఅప్పలనాయుడు, సీనియర్ నాయకులు నారాశేషు, సిరిపల్లి ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 14న పిఠాపురంలో నిర్వహించే పార్టీ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

ఉంగుటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరులో ఒక మహిళ అక్రమంగా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ ఉంచిన విషయమై శుక్రవారం నాడు స్థానిక సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ స్వర్ణ దుర్గ తనిఖీ చేసి ఇరవై నాలుగు మూటలను స్వాధీనం చేసుకున్నారు. సుమారు టన్ను బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అపరాలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం: జేసీ

ఏలూరు, మార్చి7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో మినుములు, పెసలు కొను గోలు ప్రక్రియను ప్రారంభిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి తెలిపారు. జేసీ చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. గుర్తించిన కొనుగోలు కేంద్రాల్లో భద్రత, తూకాలు సక్రమంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. పెసలు క్వింటాకు రూ.8,682, మినుములు క్వింటాకు రూ.7400లకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. జిల్లాలో పెదపాడు, ఏలూరు, దెందులూరు, ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి మండలాల్లో ఈ పంట నమోదు చేసుకున్న రైతుల నుంచి మినుములు, పెసు మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు సమీపంలోని రైతు సేవాకేంద్రాల్లో నేటి శనివారం నుంచి సీఎంఏపీ ద్వారా రైతుల పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. తేమశాతం 12 శాతంలోపు ఉండాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ధాత్రిరెడ్డి కోరారు. నూజివీడు సబ్ కలెక్టర్ కె స్మరణ్‌రాజు, వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం సీహెచ్ ప్రసాద్ గుప్తా, మహేంద్రనాథ్‌లు పాల్గొన్నారు.

రంజాన్ తొలి శుక్రవారం ప్రత్యేక నమాజ్‌లు

పోలవరం, మార్చి7(ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసపు తొలి శుక్రవారం ప్రత్యేక నమాజ్‌లు పోలవరం మసీదులో నిర్వహించారు. పట్టిసీమ, గూటాల, ఎల్లండీపేట మసీదులలో శుక్రవారపు నమాజులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం మసీదు కమిటీ అధ్యక్షులు ఎండి యాసీన్ షరీఫ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ మంది భక్తులు నమాజు కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో పనిచేసే ఇతర రాష్ట్రాల ముస్లింలు సైతం ప్రత్యేక వాహనాల్లో వచ్చి నమాజుల్లో పాల్గొన్నట్లు తెలిపారు. హిందువులు సైతం రోజాలు పాటించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారని సుమారు వెయ్యిమందికి పైగా నమాజు కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

కెనరా బ్యాంకు వాటర్ బాటిళ్ల పంపిణీ

పోలవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి):గూటాల గ్రామంలో ఇటీవల నూతనంగా జీర్ణోద్ధరణ చేసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, హోమాల కార్యక్రమాలలో శుక్రవారం కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఉచితంగా వాటర్ బాటిళ్లు వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బ్యాంకు మేనేజర్ కిరణ్ కుమార్, టీడీపీ మాజీ మండల అధ్యక్షులు పాపోలు రత్తయ్య, టీడీపీ యువజన నాయకులు పెద్దేహపు వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

బుట్టాయగూడెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తమకు ఇష్టమైన రంగంలో శిక్షణ పొందడంతోపాటుగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కెఆర్‌పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ గిరిజనులకు సూచించారు. శుక్రవారం పులిరాముడుగూడెంలో జరుగుతున్న వెదురుతో తయారుచేసే వస్తువుల శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. శిక్షణ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంవో శిరమయ్య, వైటీసీ మేనేజర్ రాజు ఉన్నారు.

ఏజెన్సీకి మలేరియా కార్యాలయం

బుట్టాయగూడెం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రభుత్వంలో ఏజెన్సీ నుంచి జిల్లా కేంద్రానికి తరలిపోయిన జిల్లా మలేరియా కార్యాలయం ఎట్టకేలకు కూటమి ప్రభుత్వంలో ఏజెన్సీకి వచ్చింది. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు కెఆర్ పురం ఐటీడీఏ కార్యాలయానికి అందాయి. అధికారులు కూడా కార్యాలయం తరలింపును ధృవీకరించారు. ఏలూరు తరలించిన మలేరియా కార్యాలయాన్ని ఏజెన్సీకి తరలించి ఇక్కడ నుంచే పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజనులు అనేకమార్లు ఆందోళనలు చేశారు. అధికారులకు వినతులు ఇచ్చారు. చివరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తరలిపోయిన కార్యాలయం ఏజెన్సీకి తిరిగి వచ్చేసింది.

భీమడోలులో జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు



అమ్మవార్లకు పూజలు చేస్తున్న భక్తులు

భీమడోలు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : భీమ డోలులో జరుగనున్న జాతరకు ఏర్పాట్లు చేసినట్లు ఏలూ రు డీఎస్పీ శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం అమ్మవార్ల జాతర ఉత్సవాల ఆలయాల సమీపంలో పోలీస్ సిబ్బం దికి జాతర ఏర్పాట్లపై పలు ఆదేశాలు ఇచ్చారు. జాతరకు సమారు రెండు లక్షల మంది భక్తులు హాజరయ్యే తరుణంలో పోలీస్ సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సీఐ విల్సన్‌కు, ఎస్ఐ సుధాకర్‌కు పలు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం సీఐ విల్సన్ మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు భీమడోలు గ్రామంలో ఏడుగురు ఎస్ఐలు, 34 మంది ఏఎస్‌లతో పాటు మొత్తం 130 మంది సిబ్బందితో గ్రామలో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎటు వంటి అసాంఘిక కార్యక్రమాలు ఇబ్బందులు ఏర్పడకుండా సీసీ కెమెరాలు, రాత్రి సమయంలో ప్రతి ప్రాంతంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

నేడు మహిళా పోలీస్ డార్మెటరీకి శంకుస్థాపన

ఏలూరు క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలో ఉన్న పోలీస్ డార్మెటరీ వద్ద మహిళా పోలీస్ డార్మెటరీ నిర్మించడానికి శనివారం ఉదయం 10.30 గంటలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ పుట్టామహేష్, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పోలీసు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఏలూరు ఎంపీ ల్యాడ్స్ నిధులతో భవన నిర్మాణం చేపట్టనున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఏలూరు క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో ఈనెల 8వ తేదీ శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం సునీల్‌కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాసదన్‌లో ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్ ప్రారంభం అవుతుందని ముందుగా న్యాయ విజ్ఞాన సదస్సు జరుగుతుందన్నారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ కె.మన్మథరావు రాక

ఏలూరు క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ డాక్టర్ కె మన్మథరావు ఈనెల8వ తేదీన ఏలూరు రానున్నారు. ఉదయం 8.30 గంటలకు ఏలూరులోని జిల్లా రెవెన్యూ గెస్ట్ హౌస్‌కు చేరుకోనున్నారు. ఏలూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్ న్యాయవాదులు నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం మధ్యాహ్నం 10.15 గంటలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించనున్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):గృహనిర్మాణ సంస్థలో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.పి.ఆర్ విఠల్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్చినెల సీఎఫ్‌ఎమ్ఎస్ సిబ్బంది బడ్జెట్ లేదని, బిల్లులు వెనక్కి పంపుతున్నారన్నారు.

ప్యాడ్‌లు, పెన్నుల పంపిణీ

వేలేరుపాడు, మార్చి7 (ఆంధ్రజ్యోతి): వేలేరుపాడు హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అమరవరపు అశోక్, విద్యా కమిటీ చైర్మన్ బేతి శ్రీను, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సంజీవుడు, నాయకులు రాంబాబు, కొమ్మన వెంకటేశ్వరరావు, కరుటూరి కృష్ణ, కోటిపల్లి ముత్యాలరావు, కనకారావు, పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల్ని ఢీకొట్టిన లారీ



ప్రమాదంలో నేలకూలిన విద్యుత్ స్తంభాలు

ద్వారకాతిరుమల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మద్యాన్ని సేవించిన ఓ లారీ డ్రైవర్ ద్వారకాతిరుమలలో రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టాడు. ఈ ఘటన శ్రీవారి కొండపైకి వెళ్లే ఆర్చిగేటు కూడలి వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. ఈ ఘటనలో విద్యుత్ వైర్ల నుంచి స్పార్క్‌లు వచ్చాయి. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో అతనికి స్థానికులు దేహశుద్ధి చేశారు. భీమడోలు నుంచి ద్వారకాతిరుమలకు వచ్చిన సిమెంట్, ధర్మాకోల్ లోడు లారీ కామవరపుకోటకు వెళ్లబోయి కొండపైకి వెళ్లే ఆర్చిగేటు వద్దకు వచ్చింది. దారి తప్పామని తెలుసుకున్న డ్రైవర్ దానిని యూటర్న్ తీసుకునే క్రమంలో అమాంతం రెండు విద్యుత్‌స్తంభాలను ఢీకొట్టాడు. విద్యుత్‌శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని గంటల తరబడి పనులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఈసారి ఏం చేస్తారో ?

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీపై తీవ్ర ఉత్కంఠ

ఉమ్మడి పశ్చిమలో అరడజనుపైగా ఆశావహులు

ప్రతీసారి ఛాన్స్ కోసం ఎదురుచూపులే

ఈసారైనా కనికరించకపోతారా అనే ఆశ

ప్రయత్నాల్లో పార్టీ సీనియర్లు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీల ఎన్నిక మరొకసారి టీడీపీ ఆశావహులకు పరీక్ష పెడుతుంది. ఇప్పటికే అతి తక్కువ స్థానాలు ఖాళీ అవడం, ఆ స్థానాలు ఆశిస్తున్న వారి సంఖ్య అత్యధికంగా ఉండడంతో పార్టీలో ఉత్కంఠ నెలకొంది. రెండు దఫాలుగా అదిగో ఇదిగో అంటూ అనేకమంది ఆశ పెంచుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన, టీడీపీ సీట్ల సర్దుబాటులో భాగంగా కొంతమంది టీడీపీ సీనియర్లు త్యాగాలకోర్చారు. అప్పట్లో ఆయా స్థానాలను జనసేనకు కేటాయించడంతో ఎమ్మెల్సీ పదవుల్లో సర్దుబాటు చేస్తామంటూ అధిష్టానం కాస్తంత భరోసా ఇచ్చింది.

ఈ సారైనా ఛాన్స్ దక్కేనా

ఉమ్మడి పశ్చిమలో ఈసారైనా ఎవరైనా ఎమ్మెల్సీ అవుతారా.. కారా అనే సందిగ్ధత, టెన్షన్ అన్ని నియోజక వర్గాల్లో కనిపిస్తుంది. సాధారణంగా పార్టీ నాయకత్వం ఓ నిర్ణయం తీసుకోవడం, ఆ తదుపరి ఎవరికి ఏ సమ యంలో ఛాన్స్ ఇవ్వాలో ఖరారు చేసుకుంటారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిసారి ఇలాంటి ఉత్కంఠే నెలకొంటుంది. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమలో ఎమ్మెల్సీ స్థానాలు ఆశిస్తున్న వారిలో ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజ నేయులు ఒకరు. ఆయనతోపాటు మాజీ మంత్రి పీతల సుజాత, కె.ఎస్.జవహర్, మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జీ సైతం ఎమ్మెల్సీ ఆశావహుల జాబితాలో ఉన్నారు. ఉమ్మడి పశ్చిమలో తొలి అవకాశం గన్ని వీరాంజ నేయులుకు దక్కుతుందని మొదటి నుంచి అంచనా వేస్తున్నారు. సామాజిక సర్దుబాట్ల నేపథ్యంలో గన్నికి ఇప్పటిదాకా అవకాశం దక్కలేదు. ఉంగుటూరు నుంచి పోటీ చేయాలనుకుని ఆ స్థానం జనసేనకు కేటాయిం చడంతో పార్టీ ఆదేశాల మేరకు సీటు త్యాగం చేశారు. అప్పట్లోనే పార్టీ అధినాయకత్వం మీకు తగినంత ఛాన్స్ ఇస్తాం, వీలైతే ఎమ్మెల్సీ కోటాను పరిగణనలోకి తీసుకుం టామని భరోసా ఇచ్చారు. అప్పటి నుంచి గన్ని అనుచరులంతా తమ నాయకుడికి ఎమ్మెల్సీ సీటు ఎప్పుడు కేటాయి స్తారంటూ పదేపదే నాయకత్వాన్ని ప్రశ్నిస్తూనే వస్తున్నారు. ఈ విషయంలో సామాజిక పరమైన అంశాన్ని పక్కనపెట్టి పనితీరు, క్రమశిక్షణను పరిగణనలోకి తీసుకుని తీరాల్సిందేనని కోరుతున్నవారు. ఈసారి రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కావ డంతో ఆ స్థానాలను భర్తీ చేయబోతున్నారు. నియోజ కవర్గమైన ఉంగుటూరుతో పాటు ఏలూరు జిల్లాలోని కేడర్‌లో ఇప్పటికే ఉత్కంఠ. నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు సైతం గన్ని వీరాంజ నేయులు బాటలోనే సీటు త్యాగం చేసి పార్టీలో మిగిలి పోయారు. ఆయన వర్గీయులు సైతం తమ నాయకుడు శేషారావుకు తగినంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని చాన్నాళ్ళుగా కోరుతూనే వస్తు న్నారు. ఈసారి శేషారావుకు అవకాశం ఇస్తారా, లేకుంటే ఏమైనా నామినేటెడ్ పోస్టుతో సరిపెడతారా అనేది పార్టీలో చర్చ సాగుతుంది. మరో సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు పేరు కూడా ఈ మధ్యన అడపాదడపా చర్చకు వస్తూనే ఉంది. చాన్నాళ్ళ పాటు ఆయన పార్టీలో ఫైర్‌బ్రాండ్‌గా ఉన్నారు.

మాజీల సంగతేంటి

మిగతా నేతల మాదిరిగానే ఉమ్మడి పశ్చిమలో ఒకనాడు ఒక వెలుగు వెలిగిన మాజీ మంత్రులు కూడా ఎమ్మెల్సీ స్థానాలను ఆశిస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి అవకాశం వస్తే ఆ ఛాన్స్ తమకే వస్తుందన్న విశ్వాసంతో ఉన్నారు. మాజీ మంత్రి కె.ఎస్.జవహర్, మరో మాజీ మంత్రి పీతల సుజాత పార్టీలో కీలక స్థానాల్లోనే ఉన్నా కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వీరికి ఎలాంటి పదవులు కట్టబెట్టలేదు. పీతల సుజాతకు నామినేటెడ్ చైర్మన్ పదవి ఇచ్చినా కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఆ పదవి ఆమెకు కట్టబెట్టలేకపోయారు. అప్పటి నుంచి తనకో ఛాన్స్ ఇవ్వాలని యువనేత నారా లోకేష్‌తో పాటు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడును అభ్యర్థిస్తూనే ఉన్నారు. పార్టీలో చురుగ్గా వ్యవహరించడం, పదవి ఉన్నా, లేకపోయినా తమకు అప్పగించిన బాధ్యతను నెరవేర్చడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని పీతల సుజాత మనోభిప్రాయం. మరో వైపు ఇంకో మాజీ మంత్రి కె.ఎస్ జవహర్ అనుకూలురు కూడా తమ నాయకుడికి సరైన ప్రాధాన్యం కల్పించాలని గట్టిగానే కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీ వర్గాలకు అవకాశం ఇస్తే ఆ ఛాన్స్ జవహర్‌కే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే మాజీ మంత్రుల విషయంలో టీడీపీ అధిష్టానం వైఖరి ఏమిటనేది ఇప్పటికీ అంతుపట్టడం లేదు.ఇదిలా ఉండగా జనసేన నుంచి నాగబాబుకు ఎలాగూ పోటీకి దిగుతున్నారు. అయితే బీజేపీ నుంచి తమకో స్థానం కేటాయించాలని స్థానికంగా డిమాండ్ తలె త్తుతోంది. పార్టీలో సీనియర్ నేత పాకా సత్యనారాయణ పేరు తెరముందుకొచ్చింది. సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలు అందిస్తున్న ఆయన నామినేటెడ్ పదవులను కూడా చేపట్టలేదు. కేవలం పార్టీపరమైన పదవుల్లోనే ఉంటూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వంలో బీజేపీకి ఒక స్థానం కేటాయిస్తే పాకా సత్యనారాయణకే అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ ఆ పార్టీలో వినిపిస్తోంది.

భార్య, అత్త మామలపై దాడి

ముదినేపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కొరగుంటపాలెంలో శుక్రవారం ఓ వ్యక్తి అతని భార్య, అత్తమామలపై దాడికి దిగి తీవ్రంగా గాయపర్చాడు. పోలీసుల కథనం ప్రకారం ద్వారకా తిరుమల మండలం పి.కన్నాపురానికి చెందిన పరసా భోగేశ్వరరావుతో కొరగుంట పాలేంకు చెందిన లక్ష్మికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలంగా వారిద్దరి మధ్య గొడవ జరుగుతోంది. ఈనేపథ్యంలో లక్ష్మి తన ఇద్దరు పిల్లలతో సహా కొరగుంటపాలెంలోని పుట్టింటికి వచ్చేసింది. నాలుగు నెలల క్రితం భోగేశ్వరరావు భార్య వద్దకే వచ్చి ఉంటున్నాడు. కొరగుంటపాలెంలో ఒక గుడి ప్రతిష్ఠ సంద ర్భంగా జరిగిన అన్న సమారాధనకు అందరూ కలిసి వెళ్ళి తిరిగి వచ్చిన అనంతరం ఇంటిలోని మంచం కోడుతో భార్య లక్ష్మిని భోగేశ్వరరావు కొట్టడంతో అడ్డుకోబోయిన అత్త మామలను కూడా తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన ముగ్గురిని అంబులెన్సులో గుడివాడ ప్రభుత్వా స్పత్రికి తరలించారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మట్టి తవ్వకాలు

గోతుల్లో పడినవారు మృత్యువాత

అన్నదమ్ముల మృతికి కారణం ఇదే


అన్నదమ్ములను మింగిన గ్రావెల్ తోలకం గుండం ఇదే

చాట్రాయి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తుమ్మ గూడెం శివారు జయపురం కంభంపాటి చెరు వులో ఎంతో కాలం నుంచి మట్టి గ్రావెల్ కోసం తవ్వకాలు జరిపారు. దీనితో చెరువులో పెద్ద గోతులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నెల 6న అన్నదమ్ములు మొలుగుమాటి చంద్ర శేఖర్, విజయకుమార్ చెరువులోని గోతుల్లో మునిగి మృత్యువాత పడ్డారని స్థానికులు చెబుతున్నారు. చెరువులో నాణ్యమైన గ్రావెల్ ఉండటంతో రహదారులు నిర్మాణానికి, ఇళల మెరక చేసుకోవటానికి, కొత్త ఇళ్ల పునాదులకు మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. మారు మూల గ్రామం కావడం, పెరుగుతున్న మట్టి గ్రావెల్ అవసరాలు, రాజకీయ కారణాల వలన మట్టి తవ్వకాలను ప్రభుత్వ శాఖలు నియంత్రించలేని పరిస్థితి ఉంది. మండలం లోని అనేక గ్రామాల చెరువుల్లో మట్టి తోలకాల వలన పెద్ద పెద్ద గుండాలు ఏర్పడి ప్రమాదకరంగా తయార య్యాయి. గత ఖరీఫ్ సీజన్‌లో తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురవటంతో ఈ చెరువు నీటితో నిండింది. ఎక్కువ కాలం చెరువులో నీరు నిల్వ ఉండడం వలన మట్టి తవ్విన గుండాల్లో బురద పేరుకు పోయి ఊబిగా మారింది. అన్నద మ్ములు ఒకరి తరువాత ఒకరు గుండాల్లో మునిగి ఊబిలో చిక్కుకుపోవటం, ఈత రాకపోవడంతో ప్రాణాలు కోల్పోయారని గ్రామస్థులు అంటున్నారు. చెరువుల్లో ఉన్న ప్రమాదకరమైన గుండాలపై ప్రభుత్వం పరిశీ లన జరిపి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదమ్ముల మృతదేహాలకు అంత్యక్రియలు

పోస్టుమార్టం అనంతరం శుక్రవారం సా యంత్రం అన్నదమ్ముల మృతదేహాలను తుమ్మ గూడెం తీసుకువచ్చి అంత్యక్రియలు జరిపారు. మొలుమాటి నాగేశ్వరరావు దంపతులకు ముగ్గురు కుమారులు కాగా చేతికి అందివచ్చిన ఇద్దరు చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. తల్లిదండ్రుల ను ఓదార్చటం ఎవరివల్లా కాలేదు.

‘వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు’

మండవల్లి మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్ బాబు తెలిపారు. గ్రామంలోని మొగలిరాయి చెరువు వద్ద రక్షిత నీటి పథకం వద్ద సిబ్బందితో చేస్తున్న ఫిల్టర్ బెడ్ క్లీనింగ్ పనులను శుక్రవారం సాయంత్రం ఆమె పరి శీలించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో తాగు నీటికి ఇబ్బందులు ఏర్పడకుండా చెరువులు నింపామని తెలిపారు.





ముదినేపల్లి - గుడ్లవల్లేరు రోడ్డు అభివృద్ధి

ముదినేపల్లి -గుడ్లవల్లేరు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఐదేళ్లుగా అధ్వానంగా ఉన్న ఈ రహదారి కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.60 లక్షల నిధులతో సుమారు ఆరు కిలోమీటర్ల దూరం అభివృద్ధి చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు, ప్రమాదాలు తొలగాయి. - **ముదినేపల్లి**


ఉత్తమ ప్రతిభ చూపిన అంగన్వాడీ టీచర్లకు మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేసిన ఎంపీపీ అడవి కృష్ణ, పెన్మెత్స త్రినాథరాజు



మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ జె.నవీనలావణ్యలత, తదితరులు

ఘనంగా మహిళా దినోత్సవం

కైకలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహి ళలు ఆర్థికంగా, విద్యాపరంగా రాణించి సమా జంలో ఉన్నతస్థాయి గుర్తింపు పొందాలని ఎంపీపీ అడవి వెంకటకృష్ణ అన్నారు. కైకలూరు మార్కెట్ యార్డ్‌లోని రైతు కల్యాణ మండపంలో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దీప్తి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహిం చారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన టీచర్లకు మెమెంటోలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. న్యాయవాది ఇందిర, మార్కెట్‌యార్డ్ సెక్రటరీ బి.సౌజన్య, సీతనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి అన్నపూర్ణ, తెలుగు మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి లను సన్మానించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, ఎంపీ టీసీ మంగినేని రామకృష్ణ, ఎంఈవో రామారావు, నియోజకవర్గం లోని అంగన్వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, పాల్గొ న్నారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చగా ముఖ్య అతిథిగా ఆటపాక, కైకలూరు సర్పంచ్‌లు తలారి మణి, డీఎం నవరత్నకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు, విద్యార్థులకు ఆటలపోటీలను నిర్వహించి బహు మతులను అందజేశారు.

నూజివీడు టౌన్ : ఏదైనా సాధించగల సత్తా మహిళల సొంతమని ఎమ్మార్ అప్పారావు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ జె.నవీన లావణ్య లత అన్నారు. కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు : మంత్రి కొలుసు పార్థసారథి క్యాంప్ కార్యాలయంలో మహిళా దినోత్సవ కార్య క్రమాలను శనివారం నిర్వహించనున్నట్టు మంత్రి ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం లోని నాలుగు మండలాల పరిధిలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న మహిళా ఉద్యోగులు, ఇతర ప్రముఖ మహిళలను సత్కరించనున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఏడో రోజుకు పెద్దింటమ్మ ఉత్సవాలు

కైకలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కుబడు లను చెల్లించుకు న్నారు. అమ్మవారికి విశేష పూజలను నిర్వహిం చారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలం కరణ, భక్తులకు ఉచిత ప్రసాదాన్ని భుజ బలపట్నం గ్రామానికి చెందిన ముదునూరి వెంకటశ్రీనివాసరాజు, నాగజ్యోతి దంపతులు అందజేశారు. సాయంత్రం ఆలపాడు విజ్ఞాన్ స్కూల్ విద్యార్థుల జానపద నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. ఎండ తీవ్రత దృష్ట్యా ఈవో శ్రీనివాసు ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మంచినీటి, మజ్జిగను పంపిణీ చేశారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

ముదినేపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముది నేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించింది. పెదవేగి గురుకుల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె.జయరాజు నేతృత్వంలోని ఈ స్క్వాడ్ పరీక్షలు జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించింది. కాగా శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం బోటని, సివిక్స్, లెక్కల పరీక్షలు 121 మంది రాయాల్సి ఉండగా 116 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెం డెంట్ సత్యనారాయణ మూర్తి తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

మండవల్లి మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని అయ్యవారి రుద్రవరంలో శుక్రవారం పాఠశాల పరిధిలో ఐదేళ్లు నిండిన పిల్లల ఇళ్లకు హెచ్ఎం పిచ్చేడు, ఉపాధ్యాయులు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని తల్లిదండ్రుల వద్ద నుంచి అంగీకార పత్రం తీసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజ మాన్య కమిటీ చైర్మన్ విజయలక్ష్మీ, ఉపాధ్యా యులు జయశ్రీ, సీఆర్పీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


జాతరలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పోలేరమ్మ జాతర

కలిదిండి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పెద లంక పోలేరమ్మ జాతర శుక్రవారం వైభ వంగా ప్రారంభమైంది. అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించగా మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఈనెల 16 వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అక్రమ వంతెనలను తొలగించండి : డీసీ చైర్మన్లు

కలిదిండి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): క్యాంప్ బెల్ కాల్వపై అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ వంతెనలను తొలగించా లని కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారా యణ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సీబీ కెనాల్‌పై ఉన్న వంతెనల వద్ద దట్టంగా పేరుకు పోయిన గుర్రపు డెక్క, తూడును శుక్రవారం పరిశీలించారు. కెనాల్‌లో పిల్లరు వేసి ఇష్టానుసారంగా అక్రమ వంతెనలు నిర్మించడంతో కానాల వద్ద గుర్రపు డెక్క, తూడు పేరుకుపోయి సాగు, తాగునీటి సర ఫరాకు అంతరాయం కలుగుతోం దన్నారు. పలుమార్లు అయా వంతెనల వద్ద గుర్రపు డెక్క, తూడును ఎక్స్‌కవేటర్‌తో తొలగించినా మళ్లీ యధావిధిగా దట్టంగా పేరుకు పోతోం దన్నారు. శివారు గ్రామాల్లో తాగునీటి చెరు వులకు నీటి సరఫరా చేరక పూర్తిస్థాయిలో చెరువులు నింపడం లేదన్నారు.

అనుమానాస్పదస్థితిలో వీఆర్వో మృతి



మండవల్లి మార్చి 7(ఆంధ్రజ్యోతి): పులపర్రు వీఆర్వోగా పని చేస్తున్న డీవీ వెంక టేశ్వరరావు (52) అనుమానాస్పదస్థితిలో చెరువులో పడి మృతి చెందారు. గురువారం మధ్యాహ్నం 2గంటల వరకు గ్రామంలోనే ఆయన ఉన్నారు. ఆ తర్వాత అతని ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు నిన్న సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గాలింపు చేపట్టగా పులపర్రు మంచినీటి చెరువులో శుక్రవారం మధ్యాహ్నం మృతదేహం కన్పించింది. మూత్ర విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెంది ఉంటారని అనుమానిస్తున్నారు.

పదో తరగతి పరీక్షలకు 5,401 మంది విద్యార్థులు


ముసునూరులో విద్యార్థితో మాట్లాడుతున్న డీవైఈవో సేవ్యా

నూజివీడు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో 10వ తరగతి పరీక్షలకు 5,401 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు డీవైఈవో సేవియ్యా నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆరు మండ లాల్లో 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామ న్నారు. 5,401మంది రెగ్యులర్ విద్యార్థులతో పా టు 167 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. నూజివీడు మండల పరిధిలో 10 పరీక్షా కేంద్రాల్లో 1841 మంది, ఆగిరిపల్లి మండ లంలో 3 పరీక్షా కేంద్రాల్లో 567 మంది, ముసునూరు మండలం 3 పరీక్షా కేంద్రాల్లో 540, చాట్రా యిలో 2 పరీక్షా కేంద్రాల్లో 489, చింతలపూడిలోని 8 పరీక్షా కేం ద్రాల్లో 1341 మంది, లింగపాలెం లోని 4 పరీక్షా కేంద్రాల్లో 623 మంది, విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యం

ముసునూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని డీవై ఈవో సేవ్యా అన్నారు. ముసునూరు పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థు లకు బోధనపై ఆరా తీశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. డీవైఈవో మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు పని చేయాల న్నారు. వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక క్లాసు లు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని డీవైఈవో సూచించారు.

పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. గుడిపాడు జడ్పీ పాఠశాలను శుక్ర వారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల, మధ్యా హ్న భోజనం రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలను సంధించి సమాధానాలను రాబట్టి, పలు సూచనలు ఇచ్చా రు. టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిం చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో సుబ్బారావు సూచించారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని ఎంఈవో ఆకాంక్షించారు.

ఇంటర్ సెకండ్ ఇయర్ గణితం పరీక్ష ప్రశాంతం

చాట్రాయి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హస్కూల్ పరీక్షా కేంద్రంలో శుక్రవారం ఇంటర్ సెకండ్ ఇయర్ గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గణితం 2బీ, బోటనీ-2, సివిక్-2 పరీక్షలు జరగగా, 93 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారని ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముసునూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు, చెక్కపల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగను న్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం 4గంటల నుంచి 8గంటల వరకు, మరల 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. సబ్ స్టేషన్‌ల్లో మరమతులు నిమిత్తం ఈ మార్పులు చేయడం జరిగిందని, రైతులందరూ సహకరించాలని ఏఈ కోరారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	97, 105, 116
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



రైతు విశిష్ట సంఖ్య సరి చూసుకోవాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ బాషా

నూజివీడు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఫార్మర్ రిజిస్ట్రీ వివరాలు రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. జంగంగూడెంలో ఫార్మా రిజిస్ట్రీ కార్యక్ర మాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వ్యవ సాయశాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయి తీలు, ఇతర ప్రభుత్వ పథకాలను పొందాలంటే రైతులు విధిగా ఫార్మర్ రిజిస్ట్రీ కలిగి ఉండాల న్నారు. రబీ సీజన్‌లో ఈ పంట నమోదు ప్రక్రి య పూర్తయిందని, నూజివీడు మండలంలో 2098 మంది రైతులకు 4,897 ఎకరాల వ్యవసాయ పంటలు నమోదు చేశామన్నారు. సంబంధిత జాబితాలను ఆర్ఎస్‌కేలలో ఉంచినట్లు ఆయన తెలిపారు.

● ముసునూరు: రైతు విశిష్ట సంఖ్య నమో దు ప్రక్రియను వేగవంతం చేయాలని ఏవో కె.సీహెచ్ సూరిబాబు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ముసునూరు, చెక్కపల్లి, గుళ్ళపూడి, చింతలవల్లి తదితర గ్రామాల్లో రైతుసేవా కేం ద్రాల్లో రైతు రిజిస్ట్రేషన్ డేటాను ఆయన తనిఖీ చేశారు. మండలంలో 12వేల మంది రైతులు ఉన్నారని, ఇప్పటివరకు 8163మంది రైతుల రిజి స్ట్రేషన్ పూర్తయిందన్నారు. రైతులకు ఉపయు క్తంగా ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేప ట్టిన ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయా లని సూచించారు. కొన్ని గ్రామాల వీఏఏలు, వీహెచ్ఏలు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ లక్ష్యాలపై అలసత్వం వహిస్తే సహించేది లేదని ఏవో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు ఆలీషా మృతి

నూజివీడు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ నాయకుడు షేక్ ఆలీషా గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. మైనార్టీ విభాగంలో క్రియాశీలకంగా వ్యవహరి స్తున్న ఆలీషా మృతిపై బీజేపీ నాయకులు దిగ్భ్రాంతి చెందారు. శుక్రవారం ఆయన పార్థివ దేహాన్ని సందర్శించిన బీజేపీ పట్టణాధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి, బోను అప్పారావు, వైఎస్. దొర్రై, జీఆర్‌కే.రంగారావు, ఎం.రాజశేఖర్, శివరా జు వసుందరాదేవి తదితరులు నివాళులర్పిం చారు. ఆలీషా మృతదేహం వద్ద టైలర్స్ అసోసియే షన్ నాయకులు నివాళులర్పించారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

నూజివీడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని కోర్టు భవనాల ప్రాంగణంలో శనివారం నిర్వహి స్తున్నట్లు న్యాయాధికారి ఎ.నాగశైలజ తెలిపా రు. రాజీమార్గంలో పరిష్కరించదగ్గ కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీచేసుకుని సమయా న్ని, ధనాన్ని ఆదా చేసుకోవచ్చన్నారు. రాజీపడ దగ్గ సివిల్, క్రిమినల్, కాంపౌండబుల్ కేసులు న్యాయవాదుల ద్వారా పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. నూజివీడు కోర్టు హాల్ ప్రాంగణంలో లోక్‌అదాలత్ నిర్వహణకు 3 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్

నూజివీడు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో టెక్‌జెట్ 25 కార్యక్రమంలో భాగంగా డ్రోన్ యుఏవి టెక్నాలజీపై వర్క్‌షాపును శుక్రవారం ప్రారంభించారు. ఇగ్నైటెక్ మైండ్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ చరణ్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. డ్రోన్ ప్రాథమిక సూత్రాలు, వాస్తవ జీవితంలో ఉపయోగపడే తీరు, శాస్త్రీయత, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ సిస్టమ్ ఉపయోగించే తీరును విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రయాలపై దాడులు

నూజివీడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమంతులగూడెంలో శుక్రవారం నిర్వహించిన ఎక్సైజ్ దాడుల్లో ఒకరిని అదుపులోకి తీసుకుని పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. గ్రామానికి చెందిన బూక్యా రాములమ్మను అదుపులోకి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఆమెకు సారా సరఫరా చేస్తున్న లకావత్ ఏగేసుపై కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండ లంలోని పోతనపల్లి చిన్న తండాలో శుక్రవారం ఎక్సైజ్ దాడిలో 1600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. 10 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తా నయ్య తెలిపారు. నేర స్థలం నుంచి పారిపో యిన వడిత్య సక్రుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో ఎస్సై ఆరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.